


RNI NO.TGTEL/25/A5224

# జోర్దార్

JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక

అవినీతి అంతం - మా పంతం




కరీంనగర్ సంపుటి : 01 సంచిక : 255 శనివారం, అక్టోబర్ 03 2026, పేజీలు - 8 వెల : 2/- epaper.jordar.com

# విద్యార్థుల పరీక్ష ఫీజుల్లో అక్రమ వసూళ్లు.

- స్కూల్ అసిస్టెంట్ సస్పెన్షన్
- 12 మంది విద్యార్థుల నుంచి అదనపు ఫీజు వసూలు
- సొసైటీకి జమ చేయలేదని ఆరోపణలు
- పరీక్షలకు హాజరు కాలేక విద్యా సంవత్సరం కోల్పోయిన విద్యార్థులు.. సమగ్ర విచారణకు ఆదేశం

(వరంగల్ జోర్దార్ ప్రతినిధి)

తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ పరీక్ష ఫీజుల విషయంలో విద్యార్థుల నుంచి అధిక మొత్తంలో ఫీజు వసూలు చేసి, ఆ మొత్తాన్ని సొసైటీకి జమ చేయలేదనే ఆరోపణలపై వరంగల్ జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. మట్వాడలోని జీహెచ్‌ఎస్‌కు చెందిన స్కూల్ అసిస్టెంట్ (తెలుగు) వి. అజయ్‌బాబును జిల్లా విద్యాశాఖాధికారి (ఎఫ్‌ఏసీ) సస్పెండ్ చేశారు.అధికారుల ప్రకారం.. మొత్తం 12 మంది విద్యార్థుల నుంచి అదనంగా వసూలు చేసిన పరీక్ష ఫీజును సంబంధిత సొసైటీకి జమ చేయకపోవడంతో, ఆ విద్యార్థులు పరీక్షలకు హాజరు కాలేక ఒక విద్యా సంవత్సరాన్ని కోల్పోయినట్లు నివేదించబడింది. ఈ వ్యవహారంపై ఫిర్యాదులు, ఆరోపణల నేపథ్యంలో విద్యాశాఖ అధికారులు స్పందించి సస్పెన్షన్ వేటు వేశారు.

**సమగ్ర విచారణ.. క్రమశిక్షణా చర్యలు**




విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ కొనసాగుతున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వెల్లడించింది. విచారణలో తేలే అంశాల ఆధారంగా తదుపరి క్రమశిక్షణా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. విద్యార్థుల నుంచి వసూలు చేసిన ఫీజులు, వాటి జమకు సంబంధించిన వివరాలపై అధికారులు దృష్టి సారించారు.

# అంగన్‌వాడీ అంతర్ జిల్లా బదిలీల్లో ‘చేతివాటం’ ??

**వరంగల్ ఆర్‌జేడీ కార్యాలయ సిబ్బందిపై ముడుపుల ఆరోపణలు.. సమగ్ర విచారణకు డిమాండ్**

(వరంగల్ జోర్దార్ ప్రతినిధి)

అంతర్‌జిల్లా అంగన్‌వాడీ టీచర్ల బదిలీల ప్రక్రియలో వరంగల్ ఆర్‌జేడీ కార్యాలయ సిబ్బంది ముడుపులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి పనికీ ఓ రేటు నిర్ణయించి, డబ్బులు చెల్లించకపోతే ఫైళ్లు కదలడం లేదని ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాలకు చెందిన పలువురు అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది ఆరోపిస్తున్నట్లు సమాచారం.దూర ప్రాంతాల నుంచి బదిలీ పనుల కోసం వచ్చే జిల్లా కార్యాలయాల సిబ్బంది, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు గంటల తరబడి కార్యాలయంలో వేచి చూడాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. ఈ వ్యవహారం ఆర్‌జేడీ అధికారికి తెలియకుండానే జరుగుతోందా? అనే అనుమానాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు.బదిలీల ప్రక్రియలో అక్రమ వసూళ్లపై సమగ్ర విచారణ జరిపి, ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని మేధావి వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ అంశంపై సరైన ఆధారాలతో మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి, డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని పలువురు అంగన్‌వాడీ సిబ్బంది హెచ్చరిస్తున్నారు.




# రైస్ మిల్లర్ల ఆగ్రహం: రాష్ట్ర నాయకుల లొంగుబాటుపై తీవ్ర నిరసన

- బెదిరింపులకు తలొగ్గి సమ్మె నీరుగార్చిన సంఘాల నాయకులు
- డిమాండ్లు నెరవేరకుండానే విరమణ.. మండిపడుతున్న రైస్ మిల్లర్లు
- నాయకుల పిలుపును తిరస్కరించి యథావిధిగా మిల్లుల నిర్వహణ

(హైదరాబాద్ /వరంగల్ జోర్దార్ ప్రత్యేక ప్రతినిధి )

సంక్షోభంలో మిల్ ఇండస్ట్రీ -- అభాసుపాలైన ఆందోళనలి

తెలంగాణలో తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న రైస్ మిల్ ఇండస్ట్రీ సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన ఆందోళన చివరికి అభాసుపాలైంది. ప్రభుత్వం విధిస్తున్న వివిధ ఆంక్షలు, పెనాల్టీలు, విజిలెన్స్ దాడులపై పోరాడాల్సిన సంఘాల నాయకులు ప్రభుత్వ బెదిరింపులకు భయపడి సమ్మెను నీరుగార్చడంపై రాష్ట్రవ్యాప్తంగా రైస్ మిల్లర్లు మండిపడుతున్నారు. తమ ప్రయోజనాలను తాకట్టు పెట్టి, వ్యక్తిగత భయాల కోసం లొంగిపోయిన ఈ నాయకుల తీరును చూసి మిల్లర్లు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు.

**ఏం జరిగింది? -- వివాద నేపథ్యం**

రైస్ మిల్లర్లపై ప్రభుత్వం విధిస్తున్న 25% పెనాల్టీ, 12% వడ్డీ భారం, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు తదితర అంశాలతో పాటు మిల్లింగ్, కస్టోడియన్ చార్జెస్ పెంపు కోరుతూ మిల్లర్లు కొద్ది రోజులుగా సమ్మె బాట పట్టారు. రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ పేరుతో ఒక వర్గం హడావుడిగా సమ్మె చేసి వెంటనే వెనక్కి తగ్గగా, మరోవైపు పాడి గణపతి రెడ్డి వర్గం మరియు సామాజిక కార్యకర్త రఫీ ఆధ్వర్యంలో మిల్లర్లు ఆందోళన చేపట్టారు.

**బెదిరింపులతో నీరుగారిన ఉద్యమం**

ఉద్యమం ఉధృతమవుతున్న తరుణంలో ప్రభుత్వ పెద్దల నుంచి ఈ నాయకులకు తీవ్ర బెదిరింపులు ఎదురైనట్లు మిల్లర్లు ఆరోపిస్తున్నారు. నాయకత్వం వహిస్తున్న వారిపై పాత కేసులు బనాయించి జైల్లో పెడతామని, వారి అవినీతి చిట్టాలన్నీ బయటపెడతామని హెచ్చరించడంతో నాయకులు పూర్తిగా చేతులెత్తేశారు. ప్రభుత్వంతో ఎలాంటి రాతపూర్వక హామీలు పొందకుండానే, మిల్లర్ల డిమాండ్లను గాలికొదిలేసి అర్ధాంతరంగా సమ్మెను విరమించారు.

గొప్పలు చెబుతున్న నాయకులు.. మండిపడుతున్న మిల్లర్లులి

సమ్మె విరమణ అనంతరం సదరు నాయకులు మీడియా ముందుకు వచ్చి, “ప్రభుత్వంతో చర్చలు విజయవంతమయ్యాయని, మంత్రిగారు మా డిమాండ్లను అంగీకరించారని” గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదంగా మారిందని మిల్లర్లు వాపోతున్నారు. ప్రభుత్వం కనీసం ఒక్క డిమాండ్‌ను కూడా అధికారికంగా అంగీకరించకపోయినా, వీరు పల్లవి మార్చడం ద్రోహం కిందకే వస్తుందని మిల్లర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నయకుల పిలుపుకు స్పందనేది? -- యథావిధిగా మిల్లుల నిర్వహణనాయకులపై నమ్మకం సడలిపోవడంతో వారు పిలుపునిచ్చిన ‘మిల్లు బంద్’ను క్షేత్రస్థాయిలో మిల్లర్లు పూర్తిగా తిరస్కరించారు. నాయకుల మాటలకు విలువ లేకుండా పోవడంతో, మిల్లర్లంతా ఎక్కడికక్కడ యథావిధిగా తమ మిల్లులను నడిపించారు. స్వార్థపూరిత నాయకత్వం వల్లనే రైస్ మిల్ ఇండస్ట్రీ సమస్యలు అటకెక్కాయని, ఇలాంటి నాయకులు తమకు వద్దంటూ మిల్లర్లు తీవ్రంగా తప్పుపడుతున్నారు.

# రెడ్‌క్రాస్ ఎన్నికల్లో ‘ఎమ్మెల్సీ’ తరహా ప్రచారం!

- కరీంనగర్‌లో హోరాహోరీగా పోస్టర్లు, సోషల్ మీడియా ప్రచారం
- తొలి మేనేజింగ్ కమిటీ ఎన్నికల తీరుపై సభ్యుల అభ్యంతరాలు
- నిబంధనలు పాటిస్తున్నారా..? జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలంటూ డిమాండ్

(కరీంనగర్ జోర్దార్ నిఘా బృందం)

సేవా సంస్థగా ప్రజల్లో విశ్వసనీయత పొందిన రెడ్‌క్రాస్ ఎన్నికల్లో రాజకీయ తరహా ప్రచారం చోటుచేసుకుంటోందన్న ఆరోపణలు కరీంనగర్ జిల్లాలో చర్చనీయాంశంగా మారాయి. ఈ నెల 4న ఎస్‌ఆర్‌ఆర్ కళాశాలలో జరగనున్న కరీంనగర్ జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ ఎన్నికల నేపథ్యంలో సోషల్ మీడియాలో ప్రచార పోస్టర్లు విస్తృతంగా చక్కర్లు కొడుతున్నాయి. అభ్యర్థుల క్రమ సంఖ్యలను ప్రస్తావిస్తూ, మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరుతూ సభ్యుల గ్రూపుల్లో సందేశాలు పంపుతున్న తీరుపై పలువురు సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.దాదాపు 18 వేల మంది ఓటర్లు ఉన్నారని పేర్కొంటూ, ఎన్నికల ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్న తీరు సాధారణ రాజకీయ ఎన్నికలను తలపిస్తోందని సభ్యులు అంటున్నారు. సేవా సంస్థ ఎన్నికల్లో ఇలాంటి ప్రచార ఆర్భాటం అవసరమా? అంటూ ప్రశ్నిస్తున్నారు.

**తొలి ఎన్నికలపైనే అనేక సందేహాలు**

జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ తొలి మేనేజింగ్ కమిటీ ఎన్నికల నిర్వహణ విధానంపైనా పలువురు సభ్యులు సందేహాలు వ్యక్తం



చేస్తున్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చట్టం, 1920లోని నిబంధనలు, రాష్ట్ర, జిల్లా శాఖలకు వర్తించే మార్గదర్శకాల ప్రకారం ఎన్నికల ప్రక్రియ కొనసాగాల్సి ఉంటుందని వారు పేర్కొంటున్నారు.జాతీయ ప్రధాన కార్యాలయం నుంచి గతంలో జారీ చేసిన ఎన్నికల మార్గదర్శకాల ప్రకారం ఎన్నికల నోటీసు, ఓటర్ల ముసాయిదా జాబితా, అభ్యంతరాల స్వీకరణ, తటస్థ రిటర్నింగ్ అధికారి నియామకం వంటి అంశాలకు ప్రాధాన్యం ఉంటుందని సభ్యులు గుర్తుచేస్తున్నారు.

**పోస్టర్లు.. ప్రాధాన్యత ఓట్లు.. వాట్సాప్ ప్రచారం!**

ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థుల పేర్లు, క్రమ సంఖ్యలు, మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలంటూ సోషల్ మీడియాలో ప్రచారం సాగుతున్నట్లు సభ్యులు చెబుతున్నారు. అయితే ఇటువంటి ప్రచారానికి సంస్థ నిబంధనల్లో అనుమతి ఉందా? లేదా? అన్నది స్పష్టం చేయాల్సిన అవసరం ఉందని వారు కోరుతున్నారు.“సేవా సంస్థ ఎన్నికల్లో సేవా కార్యక్రమాలే ప్రాధాన్యమా? లేక ప్రచార ఆర్భాటమా?” అనే చర్చ ప్రస్తుతం సభ్యుల్లో జరుగుతోంది.

**సేవా సంస్థకు రాజకీయ రంగు వద్దు**

రెడ్‌క్రాస్ సంస్థ మానవత్వం, నిష్పాక్షికత, తటస్థత, స్వచ్ఛంద సేవ వంటి మౌలిక విలువలకు ప్రాధాన్యం ఇస్తుందని సభ్యులు గుర్తుచేస్తున్నారు. ఎన్నికల్లో అధిక ప్రచారం, ఆర్థికంగా బలమైనవారు లేదా పలుకుబడి ఉన్నవారికి ప్రయోజనం కలిగించే పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.సేవ చేయాలనే ఉద్దేశంతో ముందుకు వచ్చే వారికి వారి సేవా కార్యక్రమాలే గుర్తింపుగా ఉండాలని, ఎన్నికల ప్రచార ఆర్భాటం కాకూడదని వారు అభిప్రాయపడుతున్నారు.

**కలెక్టర్ జోక్యం చేసుకోవాలని డిమాండ్**

కరీంనగర్ జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీకి సంబంధించిన ఎన్నికల ప్రక్రియపై జిల్లా స్థాయిలో స్పష్టత ఇవ్వాలని సభ్యులు కోరుతున్నారు. ఎన్నికల నిబంధనలు, ఓటర్ల జాబితా, రిటర్నింగ్ అధికారి నియామకం, తొలి మేనేజింగ్ కమిటీ ఏర్పాటుకు అనుసరించిన విధానం తదితర అంశాలపై సమగ్రంగా పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ హోదాలో ఉన్న జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి, సోషల్ మీడియాలో జరుగుతున్న ఎన్నికల తరహా ప్రచారంపై నిబంధనల ప్రకారం పరిశీలన జరిపించాలని సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కోరుతున్నారు.

# స్కూటీ నంబర్ తో కారు బిల్లు..

- వరంగల్ డీఐఈవో వ్యవహారంపై తీవ్ర విమర్శలు
- ఫేక్ రసీదులతో నిధుల దుర్వినియోగం.. ఫిర్యాదులపై నిమ్మకు నీరెత్తినట్లున్న అధికారులు
- బిల్లులో బాగోతం బట్టబయలు.

(హైదరాబాద్ /వరంగల్ జోర్దార్ ప్రతినిధి)

ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్ వంటి పవిత్రమైన విద్యా కార్యక్రమానికి కేటాయించిన నిధులను దుర్వినియోగం చేస్తూ, స్కూటీ నంబర్ ను కారు నంబర్ గా చూపి రూ. 11,900 బిల్లు సృష్టించడం అత్యంత దారుణమైన అవినీతికి నిదర్శనం. 380 కిలోమీటర్లకు అద్దె, డీజిల్, టోల్, డ్రైవర్ చార్జీల పేరుతో శ్రీ అశోక ట్రావెల్స్ పేరుతో పొందిన రసీదు పూర్తిగా కల్పితమని తేలడం అధికార దుర్వినియగానికి పరాకాష్ట.. ఇది తప్పిదం కాదు.. విధానంగత ఏడాది స్పాట్ వాల్యుయేషన్ లో కూడా ఇదే తరహాలో పలు ఫేక్ బిల్లులు సృష్టించి డబ్బులు కాజేశారనే ఆరోపణలు ఉండటం, ఇది పొరపాటు కాదు, అలవాటుగా మారిన అవినీతి విధానమని స్పష్టం చేస్తోంది. విద్యార్థుల




భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన అధికారే ఇలా వ్యవహరించడం విద్యాశాఖ ప్రతిష్టకు భంగం.. ఫిర్యాదులను తొక్కిపెడుతున్న వైనంఉద్యోగులు ఇంటర్ బోర్డు సెక్రటరీకి, జిల్లా ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా చర్యలు లేకపోవడం ఆందోళనకరం. అడ్డు చెప్పిన వారిపై తప్పుడు అభియోగాలు మోపి వేధిస్తున్నారనే ఆరోపణ, కార్యాలయంలో భయానక వాతావరణాన్ని సూచిస్తోంది. బోర్డు సెక్రటరీ సమావేశంలో మందలించడంతోనే సరిపెట్టడం సరిపోదు. 4. డిమాండఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, ఇంటర్ బోర్డు సెక్రటరీ స్వతంత్ర విచారణ జరిపి, బిల్లుల వాస్తవికతను, ట్రావెల్స్ సంస్థ ప్రమేయాన్ని తేల్చాలి. నిధుల దుర్వినియోగంపై క్రిమినల్ చర్యలతో పాటు శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు, విద్యావేత్తలు డిమాండ్ చేస్తున్నారు.

**ఖైరతాబాద్ ఉప ఎన్నికలోనూ**

# గెలిచేది కాంగ్రెస్సే

**నల్లగొండ, అక్టోబర్ 2:** ఖైరతాబాద్ ఉపఎన్నికలో కాంగ్రెస్‌దే విజయమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈరోజు(శుక్రవారం) ఏబీఎన్-ఆంధ్రజ్యోతి మాట్లాడుతూ.. సిట్టింగ్ స్థానాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చనిపోయినా సింపతీ లేకుండా కాంగ్రెస్ పార్టీనే గెలిచిందని చెప్పుకొచ్చారు. దీంతో ఖైరతాబాద్ ఉప ఎన్నికలోనూ గెలిచేది కాంగ్రెస్ పార్టీనే అని అన్నారు. డిసెంబర్ నాటికి హైదరాబాద్ - విజయవాడ 65 హైవేపై అన్ని బ్లాక్ స్పాట్స్ పనులు పూర్తి అవుతాయని చెప్పారు. ఎస్-ఎల్‌బీసీ పనులు 600 మీటర్లు పూర్తి చేశామన్నారు. జూన్ 2028 నాటికి ఎస్-ఎల్‌బీసీ పూర్తి చేస్తామని ప్రకటించారు.అమెరికాలో ఐదేళ్లు జాబ్ చేస్తే మూడు ఫైవ్ స్టార్ హోటల్స్ కొనొచ్చు అంటే అంతా అమెరికా పోతారంటూ మాజీ మంత్రి కేటీఆర్‌ను ఉద్దేశించి మంత్రి వ్యాఖ్యలు చేశారు. 20 ఏళ్లు అమెరికాలో ఉన్నవాళ్లు కూడా చిన్న ఇళ్లు కొనలేరని... కేటీఆర్ సంపన్నుడని ఆయనే ఒప్పుకున్నారని అన్నారు. కేటీఆర్ ధనికుడు, వందల ఎకరాలు, ఫాంహౌస్‌లు ఉన్నాయని.. క రైతులకు సరిపోను కరెంట్ ఇచ్చామని.. ప్రస్తుతం పంటలు కోతకు వచ్చాయని తెలిపారు. పక్క రాష్ట్రంలో యూనిట్ రూ.10కి కొని కరెంట్ ఇచ్చామన్నారు. కరవు వచ్చిందని వాళ్లు సంతోష పడుతున్నారని... తాము బాధ పడుతున్నామని చెప్పుకొచ్చారు. పోయిన సారి కంటే వరి సాగు 5% తగ్గిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం



# అక్టోబర్ 2 యొక్క ప్రాముఖ్యత

మనం ఎప్పుడూ అక్టోబర్ 2వ తేదీని గాంధీ జయంతిగా జరుపుకుంటాము, కానీ చాలా మంది ఈ రోజున మన గొప్ప నాయకుడు మరియు ఉత్తమ మాజీ ప్రధానమంత్రి అయిన శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి గారికి సంబంధించిన మరో వేడుక కూడా ఉందని మర్చిపోతున్నారు. ఆయన పుట్టినరోజు కూడా అదే రోజున వస్తుందని చాలా మందికి తెలియదు . ఎందుకంటే మన పాఠశాలలు, కళాశాలల్లో మనకు అక్టోబర్ 2వ తేదీన గాంధీ జయంతి గురించి మాత్రమే చెప్పారు.

అయితే, ఇది దివంగత లాల్ బహదూర్ శాస్త్రి గారి పుట్టినరోజు కూడా అని చాలా తక్కువ మందికి తెలుసు; ఒక విధంగా మనం ఈ రోజును గాంధీ జయంతి అని, అలాగే శాస్త్రి జయంతి అని కూడా పిలవాలి.

లాల్ బహదూర్ శ్రీవాస్తవ శాస్త్రి భారత గణతంత్ర రాజ్యానికి రెండవ ప్రధానమంత్రి మరియు భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక ముఖ్యమైన వ్యక్తి. నెహ్రూ తర్వాత బాధ్యతలు చేపట్టిన ఆయన, భారతదేశ సామాన్యుడి గురించి ఆందోళన చెంది, 'జై జవాన్, జై కిసాన్' అనే నినాదాన్ని ఇచ్చి, క్లిష్టమైన సంవత్సరాలలో భారతదేశానికి నాయకత్వం వహించారు. భారతదేశంలో భారతరత్న పురస్కారం అందుకున్న మొదటి వ్యక్తి లాల్ బహదూర్ శాస్త్రి.

లాల్ బహదూర్ శాస్త్రి వంటి, దేశం కోసం త్యాగాలు చేసిన వారిని మనం మర్చిపోవద్దు. మన దేశాన్ని, జాతిని రక్షించడం కోసం తన జీవితాన్ని పూర్తిగా అంకితం చేసిన ఆ మహనీయుడిని మర్చిపోవద్దు.

పాఠకులందరికీ గాంధీ జయంతి, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి మరియు అంతర్జాతీయ అహింసా దినోత్సవ శుభాకాంక్షలు.

జైహింద్

డా. శ్రీనివాసరెడ్డి.

# విశ్వహిందూ పరిషత్ మాతృశక్తి ఆధ్వర్యంలో బొడ్డెమ్మ వేడుకలు

**హుజురాబాద్,జోర్దార్ ప్రతినిధి:**హుజూరాబాద్ మండలంలోని కనుకుల గిద్ద గ్రామంలో విశ్వహిందూ పరిషత్ మాతృ శక్తి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం బొడ్డెమ్మ పండుగ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ మహిళా మాతృశక్తి గ్రామ అధ్యక్షురాలు లింగాల రజిత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ బొడ్డెమ్మ పండుగ అంటే ఏమిటి దాని విశిష్టతను ప్రజలకు వివరించారు. ముఖ్యంగా బొడ్డెమ్మ పండుగను కన్నెపిల్లలు చేసుకునే పండుగని, వినాయక చవితి పండుగ తర్వాత వచ్చే భాద్రపద బహుళ పంచమి నుండి తొమ్మిది రోజులు అనగా అశ్వయుజ శుద్ధ పాడ్యమికి ముందు వచ్చే అమావాస్య వరకు



జరుపుకునే పండుగ అని తెలిపారు. ఈ సందర్భంగా మహిళలందరూ కలిసి స్థానిక పుట్ట దగ్గరికి వెళ్లి పుట్ట మన్నుతో బొడ్డెమ్మను తయారు చేశారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షుడు కంకణాల రమేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కనుకుల గిద్ద గ్రామంలో బొడ్డెమ్మ వేడుకలను సాంప్రదాయబద్ధంగా జరుపుకుంటామని, భక్తిశ్రద్ధలతో బొడ్డెమ్మను పూజిస్తామని మహిళలందరూ తొమ్మిది రోజులు బొడ్డెమ్మను ఆడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ మాతృశక్తి గ్రామ శాఖ అధ్యక్షురాలు లింగాల రజిత లక్ష్మారెడ్డి, డాక్టర్ మోడెపు,మౌనిక , మోడపు పుష్ప, కంకణాల లక్ష్మి, లింగాల నీరజ, జాలి లక్ష్మి, రొంటాల జ్యోతి, జిన్న సరళ, కంకణాల రమా, లింగాల లావణ్య, కంకణాలు శకుంతల గ్రామ మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

# గాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకుల ఘన నివాళి

**హసన్‌పర్తి,జోర్దార్ ప్రతినిధి:**మహాత్మా గాంధీ 157వ జయంతిని పురస్కరించుకుని హసన్‌పర్తి 66వ డివిజన్‌లో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు హసన్‌పర్తి బస్టాండ్ ఆవరణలోని గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా 66వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గొర్రె కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. గాంధీజీ ఒక పేరు కాదని, ఒక మార్గదర్శకుడని అన్నారు. సత్యాన్ని ఆయుధంగా, అహింసను మార్గంగా, త్యాగాన్ని జీవితంగా, స్వాతంత్ర్యాన్ని సంకల్పంగా చేసుకున్న మహనీయుడు గాంధీజీ అని పేర్కొన్నారు. సత్యం, అహింస, సమానత్వం కోసం నిలబడటమే గాంధీజీకి అందించే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సంపత్ యాదవ్, పెద్దమ్మ నరసింహరాములు, బిగుళ్ల సురేష్, సాంబయ్య యాదవ్, సతీష్, శీలం రమేష్, పెద్దమ్మ జితేందర్, బొల్లె రంజిత్, రాణి, జన్ను భద్రయ్యతో పాటు వివిధ కుల



సంఘాల పెద్దలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# హుజురాబాద్ బస్టాండ్‌లో ఆటో చోరీ

- నిందితుడి ఆచూకీ తెలిపిన వారికి బహుమతి

**హుజురాబాద్,జోర్దార్ ప్రతినిధి:**హుజురాబాద్ బస్టాండ్ వద్ద ఆటో చోరీకి గురైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సెప్టెంబర్ 28న బస్టాండ్ వద్ద ఓ వ్యక్తి ఆటోను దొంగిలించి అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు. చోరీకి పాల్పడిన వ్యక్తిని ఎవరైనా గుర్తించినా, అతని ఆచూకీ లేదా చిరునామాకు సంబంధించిన సమాచారం తెలిసినా వెంటనే హుజురాబాద్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచడంతో పాటు తగిన బహుమతి అందజేస్తామని తెలిపారు.



# గాంధీజీ సేవలు మరువలేనివి

- చైర్ పర్సన్ రెంటాల సుహాసిని

**హుజురాబాద్,జోర్దార్ ప్రతినిధి:**హుజురాబాద్ మున్సిపల్ పరిధిలోని కేఎస్ క్యాంపులో మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్‌రావు గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశానికి గాంధీజీ చేసిన సేవలు మరువలేనివని అన్నారు. పేద రైతులు, కూలీల కోసం ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి పేరు మార్చి నిర్వీర్యం చేయడం సరికాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ గూడూరి అంజలి, కమిషనర్ కిషన్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు మేకల



తిరుపతి, కిరణ్, మున్సిపల్ సిబ్బంది, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గాంధీజీ చిత్రపటానికి మార్కెట్ యార్డులో ఘన నివాళి



**కమలాపూర్,జోర్దార్ ప్రతినిధి:**కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు గాంధీజీ సేవలను స్మరించుకున్నారు.

కార్యక్రమంలో తౌటం ఝాన్సీ రాణి మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్య పోరాటంలో కాంగ్రెస్ పార్టీ, మహాత్మా గాంధీజీ కీలక పాత్ర పోషించారని అన్నారు. స్వాతంత్ర్యం కోసం గాంధీజీ తన జీవితాన్ని అంకితం చేశారని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ చరిత్ర, ఆయన సేవలను ప్రజల హృదయాల్లో నిలిచేలా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. గాంధీజీ పేరుతో కొనసాగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయకుండా కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో తౌటం రవీందర్, మార్కెట్ డైరెక్టర్లు సముద్రాల కృష్ణ, జనగాని శివకృష్ణ, ఆకినపల్లి బిక్షపతి, గట్టు శ్రీధర్, కిన్నెర కృష్ణమూర్తి, మార్కెట్ కార్యదర్శి జన్ను యాకయ్య, అబ్బరవేణి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో ఆరోగ్య పథకం అమలుకు చర్యలు తీసుకోవాలి




**కరీంనగర్,జోర్దార్ ప్రతినిధి:**గాంధీ జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం (టీఎస్‌జీఆర్ఈఏ) కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అనంతరం సంఘం ప్రతినిధులు పెన్షనర్లు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు. నూతన ఉద్యోగుల ఆరోగ్య పథకం కింద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లోనూ చికిత్స అందేలా ప్రభుత్వం, ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఉస్మాన్ పాషా, ప్రధాన కార్యదర్శి జాలి మహేందర్ రెడ్డి, ఆర్థిక కార్యదర్శి పోలాస రామచంద్రం, రాష్ట్ర కార్యదర్శి మనోహర్ కుమార్ గౌడ్, జిల్లా కార్యదర్శులు కాజా శంషొద్దీన్, రమణ, ప్రచార కార్యదర్శి శ్రీధర్ రావు, రాష్ట్ర కౌన్సిలర్ చోటా మియా, ఆర్. మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డిని సంఘం నాయకులు సత్కరించారు.

# జల్లి గ్రామంలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

**జల్లి,జోర్దార్ ప్రతినిధి:**జల్లి గ్రామంలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని గాంధీ విగ్రహానికి సర్పంచ్ యాట సుధాకర్, ఉప సర్పంచ్ మెరుగు బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గాంధీజీ అహింసా మార్గం, ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు అంబాల బిక్షపతి, బోడా మోతిలాల్, గంధం భాస్కర్, కొర్ర మోహన్, చీకటి నందు, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్, ఫీల్డ్ అసిస్టెంట్ మర్రి సురేష్,



కారోబారి దొంతర పోయిన రాజు, పింగళి రజనీకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు



**హుజురాబాద్,జోర్దార్ ప్రతినిధి:**హుజురాబాద్ పట్టణంలోని జమ్మికుంట రోడ్డులోని కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద భారత మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీసీ ఆజాది ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుకమారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శాస్త్రి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆయన సత్యం, అహింస సిద్ధాంతాలను, స్వాతంత్ర్య ఉద్యమంలో చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో మంచికట్ల కమలాకర్, సబ్బని రాజేందర్, మందా బిక్షపతి, దేవసాని ప్రియ దర్శిని, ఇప్పనపల్లి చంద్రశేఖర్, ఇప్పకాయల సాగర్, కొల్లిపాక క్రాంతికుమార్, మామునూరి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించిన ఉపాధ్యాయులు



**వికారాబాద్,జోర్దార్ పేపరు ప్రతినిధి:**వికారాబాద్ జిల్లా మున్సిపాలిటీలో గాంధీ జయంతి సందర్భంగా పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు కడియాల శేఖర్‌తో పాటు ఉపాధ్యాయులు మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం అహింసాయుతంగా పోరాడిన మహాత్మా గాంధీ సేవలు చిరస్మరణీయమన్నారు. గాంధీజీ అహింసా సిద్ధాంతాలను పాటిస్తూ దేశ భవిష్యత్తు నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.




# ఆదిలాబాద్ ఐటీ టవర్ ప్రారంభానికి సిద్ధం

**ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:**ఆదిలాబాద్‌లో సుమారు రూ.60 కోట్ల వ్యయంతో నిర్మించిన ఐటీ టవర్ ప్రారంభానికి సిద్ధమైంది. ఈ నెలలో ఐటీ శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు దీనిని ప్రారంభించనున్నారు. జాతీయ రహదారి-44కు ఆనుకుని నిర్మించిన నాలుగు అంతస్తుల భవనంలో 50 వేల చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్, మీటింగ్ హాళ్లు, కేఫెటీరియా తదితర సదుపాయాలు ఉన్నాయి. ఇప్పటికే మూడు ఐటీ కంపెనీలు యూనిట్ల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. టవర్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే సుమారు 2 వేల మంది యువతకు



స్థానికంగా ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంది.

# పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు పెంచాలి




**హుజురాబాద్,జోర్దార్ ప్రతినిధి:**హుజురాబాద్ మండలం చెల్పూరు గ్రామంలో పంచాయతీ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత ఎనిమిదేళ్లుగా వేతనాలు పెంచకుండా ప్రభుత్వం కార్మికుల శ్రమను దోపిడీ చేస్తోందని ఆరోపించారు. ప్రస్తుతం అందుతున్న రూ.9,500 వేతనంతో కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందన్నారు.కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా వంటి సౌకర్యాలు కల్పించడంతో పాటు కనీస వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పలుమార్లు ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ మంత్రి, కమిషనర్‌కు వినతులు సమర్పించినా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని కొనసాగిస్తే రాష్ట్రవ్యాప్తంగా మరో పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్ మండల ఉపాధ్యక్షుడు శనిగరపు కొండయ్య, కార్మికులు మనక్క, సరోజన, మొగిలి, సమ్మయ్య, విష్ణు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి



**హుజూరాబాద్,జోర్దార్ ప్రతినిధి:**జర్నలిస్టుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని హుజూరాబాద్ ప్రెస్ క్లబ్ (టీయూడబ్ల్యూజే) అధ్యక్షుడు కాయిత రాములు, కార్యదర్శి కామని రవీందర్ డిమాండ్ చేశారు.

ఐజేయూ పిలుపు మేరకు గాంధీ జయంతి సందర్భంగా ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలోని గాంధీ విగ్రహం ఎదుట పాత్రికేయులు శాంతియుత నిరసన చేపట్టి, అనంతరం తహసీల్దార్ నరేందర్‌కు వినతిపత్రం అందజేశారు.

జర్నలిస్టులకు రక్షణ చట్టం, నూతన వేజ్ బోర్డు, రైల్వే రాయితీ పాసుల పునరుద్ధరణతో పాటు అర్హులకు ఇళ్ల స్థలాలు, క్యాష్‌లెస్ ఆరోగ్య కార్డులు కల్పించాలని డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ పట్టణ, మండల పరిధిలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# గాంధీ జయంతి సందర్భంగా సీఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటడం



**చింతూరు,జోర్దార్ బ్యూరో:**జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని చింతూరులో సీఆర్‌పీఎఫ్ డీ/42వ బెటాలియన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. అసిస్టెంట్ కమాండెంట్ సంతోష్ కుమార్ సింగ్, ఇన్‌స్పెక్టర్ సి. అన్బుచెజియన్, సీఐ గోపాలకృష్ణ, ఎస్‌హెచ్‌ఓ సంతోష్ కుమార్, సీఆర్‌పీఎఫ్ జవాన్లు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో చెట్ల ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు.

# గాంధీ జయంతి సందర్భంగా క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని చేపట్టిన సెయింట్ మేరీ స్కూలు విద్యార్థులు, అధ్యాపకులు




**బెల్లంపల్లి జోర్దార్ ప్రతినిధి:**గాంధీ జయంతిని పురస్కరించుకొని, శుక్రవారం బెల్లంపల్లి పట్టణంలోని సెయింట్ మేరీస్ పాఠశాల విద్యార్థులు, అధ్యాపకులు," మిషన్ క్లీన్ 2026" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా దాదాపు రెండు వందల మంది పాఠశాల విద్యార్థులతో అధ్యాపకులు కలిసి పట్టణంలోని కొత్త బస్టాండు, కన్నాల బస్తి ఫ్లైఓవర్ పైన, ప్రధాన రహదారి వెంట, రద్దీ ప్రాంతాలలో రోడ్లను ఊడ్చి, చెత్తా చెదారాలను ఎత్తివేసి శుభ్రపరిచారు.
ఈ సందర్భంగా పాఠశాల అధ్యాపకుడు ముద్దు శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని అందరికీ ఆదర్శంగా నిలవాలని కోరారు.
ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడంతో పాఠశాల మేనేజ్మెంట్‌కు స్థానికులు అభినందనలు తెలిపారు.

# ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన



**వడ్డేపల్లి,జోర్దార్ ప్రతినిధి:**వడ్డేపల్లి మున్సిపాలిటీలో ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టి పర్యావరణ పరిరక్షణకు శాంతినగర్ సేవాసమితి ఆధ్వర్యంలో షేక్ అస్లాం షరీఫ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, పారిశుధ్య కార్మికులు, సిబ్బందికి బట్ట సంచులను పంపిణీ చేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌తో పర్యావరణం, మానవ ఆరోగ్యానికి నష్టం కలుగుతుందని షేక్ అస్లాం షరీఫ్ తెలిపారు.
ప్రతి ఒక్కరూ బట్ట సంచులను వినియోగించి వడ్డేపల్లిని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమాన్ని కౌన్సిలర్లు, సిబ్బంది, స్థానికులు అభినందించారు.

# గాంధీ జయంతి సందర్భంగా ఘన నివాళులు



**(వరంగల్ జోర్దార్ ప్రతినిధి)** జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా పబ్లిక్ గార్డెన్‌లో శుక్రవారం గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా నివాళులు అర్పించారు.
ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద,
హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, మాజీ కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి తదితరులు గార్లతో పాటు ప్రజా ప్రతినిధులు, అభిమానులు గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు గారు మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ అహింస, సత్యం, శాంతి, సత్యాగ్రహం వంటి గొప్ప సిద్ధాంతాలతో భారత స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించారని అన్నారు. దేశ ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చి స్వాతంత్ర్య సాధనలో కీలక పాత్ర పోషించిన గాంధీజీ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ప్రజా ప్రతి నిధులు వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు ,వారి అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కుంకుమేశ్వర దేవస్థాన చైర్మన్‌కి సన్మానం



**పరకాల జోర్దార్ ప్రతినిధి:**హన్మకొండ జిల్లా పరకాల లోని శ్రీ కుంకుమేశ్వర దేవస్థానం చైర్మన్ గా నాలుగవ సారి ఎన్నిక అయి ప్రమాణ స్వీకారం చేసిన పరకాల కి చెందిన కొలుగూరి రాజేశ్వర్ రావు ను ఓ సి సంఘాల రాష్ట్ర కన్వీనర్ గోపు జై పాల్ రెడ్డి,రాష్ట్ర అధికార ప్రతినిధి కామిడి సతీష్ రెడ్డి,రాష్ట్ర కో ఆర్డినేటర్ మాడుగుల పాపి రెడ్డి,బూచి ప్రభాకర్ రెడ్డి తదితరులు దేవస్థాన ఆవరణ లో సన్మానించారు.జై పాల్ రెడ్డి మాట్లాడుతూ రాజేశ్వర్ రావు ఓ సి సంఘాలలో చురుకైన వ్యక్తి అని గుడి చైర్మన్ గా నాలుగవ సారి నియామకం కావడం అభినంద నీయం అన్నారు వారి హయాం లో వారు పాలక మండలి కుంకుమయ్య గుడిని మరింత అభివృద్ధి చేయాలని అన్నారు.వారికి అన్ని వేళలా తమ ఓ సి సంఘాల సహకారం ఉంటుందని అన్నారు వారితో చిట్టి రెడ్డి వెంకట్ రెడ్డి,ఎర్రబెల్లి భాస్కర్ రెడ్డి కొలుగురి వేణు రావు పాల్గొన్నారు

# గాంధీ జయంతి రోజున చికెన్ బిర్యానీతో కాలేజీ విందు

- కనిష్క డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే కార్యక్రమంపై అభ్యంతరాలు




**హసన్‌పర్తి,జోర్దార్ ప్రతినిధి:**గాంధీ జయంతి సందర్భంగా జీవహింసకు దూరంగా ఉండాల్సిన రోజున హసన్‌పర్తి మండలం భీమారంలోని కనిష్క డిగ్రీ కళాశాల యాజమాన్యం విద్యార్థులకు చికెన్ బిర్యానీతో విందు ఏర్పాటు చేయడం చర్చనీయాంశంగా మారింది. చింతగట్టు క్యాంపు సమీపంలోని యం టీ అర్ గార్డెన్స్‌లో శుక్రవారం ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించగా, ఇందులో పాల్గొన్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనంగా చికెన్ బిర్యానీ వడ్డించారు.
గాంధీ జయంతి రోజున మాంసాహార విందు ఏర్పాటు చేయడంపై పలువురు స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ విషయంపై విలేకరులు కళాశాల యాజమాన్యాన్ని వివరణ కోరగా, చికెన్‌ను ముందురోజు రాత్రి 12 గంటలలోపు కట్ చేయించి ఫ్రిజ్‌లో భద్రపరిచిన అనంతరం శుక్రవారం బిర్యానీ తయారు చేసి వడ్డించినట్లు యాజమాన్యానికి చెందిన వ్యక్తి తెలిపారు. అయితే మరోవైపు బిర్యానీని బయట క్యాటరింగ్‌కు ఆర్డర్ ఇచ్చినట్లు యాజమాన్యానికి చెందిన మరో వ్యక్తి పేర్కొనడం గమనార్హం.ఇదిలా ఉండగా, బిర్యానీ విషయంపై వివరణ కోరుతున్న సమయంలో మిగిలిన బిర్యానీని ఫంక్షన్ హాల్ నుంచి ఓ వాహనంలో బయటకు తరలించినట్లు స్థానికులు తెలిపారు. గాంధీ జయంతి వంటి ప్రత్యేక రోజున కళాశాల స్థాయిలో మాంసాహార విందు ఏర్పాటు చేయడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తూ, విద్యాసంస్థలు ఇలాంటి కార్యక్రమాల విషయంలో సామాజిక, సాంస్కృతిక అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

# గాంధీజీ మార్గం యువతకు ఆదర్శం



**కరీంనగర్,జోర్దార్ ప్రతినిది:** మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా కోతిరాంపూర్ చౌరస్తాలోని గాంధీజీ విగ్రహానికి తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరి ప్రసాద్ మాట్లాడుతూ.. గాంధీజీ అహింస, శాంతి, సత్యాగ్రహ మార్గాలు దేశ ప్రజలకు స్ఫూర్తిదాయ కమని అన్నారు. గాంధీజీ కలలు కన్న సమానత్వ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, యువత సత్యం, అహింసను ఆదర్శంగా తీసు కోవాలని పిలుపునిచ్చారు.
ఈ కార్య క్రమంలో అంకం శివరాణి, పిన్నింటి సంగీత రెడ్డి, రంగరవేణి లక్ష్మణ్, మ్యాకల తిరుపతి, బసవేణి రాజేందర్, చంటి శ్రీనివాస్, శ్రీరాముల రమేష్, గాలిపల్లి రత్నాకర్ చారి, నూతి సాయి చరణ్, నగునూరి రమేష్, బండారి అభిరామ్, జంగ అపర్ణ సాగర్, కొలిపాక గౌతమి, దాసరి అంజలి తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



**(జోగులాంబ గద్వాల్ జోర్దార్ ప్రతినిధి):** అయిజ పట్టణంలోని సంత బజారు అంగన్వాడీ కేంద్రంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ సి.ఎం. సురేష్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు బాలికల భవిష్యత్తుకు ఆటంకంగా మారుతాయని అన్నారు. చిన్న వయసులో వివాహాలు చేయడం వల్ల బాలికల ఆరోగ్యం, విద్యపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. ప్రతి బాలికకు విద్య, ఆరోగ్యం, స్వేచ్ఛగా ఎదిగే అవకాశం కల్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, సమాజంపై ఉందన్నారు.బాల్య వివాహాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు.
బాల్య వివాహాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని చైర్మన్ సి.ఎం. సురేష్ పిలుపునిచ్చారు.
ఈ కార్యక్ర మంలో మున్సిపల్ సిబ్బంది, కౌన్సిలర్లు, అంగన్వాడీ టీచర్లు, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ హాకీలో కరీంనగర్ కేంద్రీయ విద్యాలయానికి కాంస్యం



**కరీంనగర్,జోర్దార్ ప్రతినిధి:**పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ సంఘటన్ కరీంనగర్ అండర్–14 హాకీ జట్టు జాతీయ స్థాయిలో సత్తా చాటి కాంస్య పతకంతో పాటు కప్‌ను కైవసం చేసుకుంది. హైదరాబాద్ రీజియన్ తరఫున ఢిల్లీలో జరిగిన నేషనల్ స్పోర్ట్స్ మీట్‌లో జట్టు లీగ్ మ్యాచ్‌ల నుంచి సెమీఫైనల్ వరకు అజేయంగా కొనసాగింది. జైపూర్ రీజియన్ జట్టుపై విజయం సాధించి కాంస్య పతకాన్ని సాధించింది. ప్రిన్సిపాల్ పంకజ్ కుమార్, హాకీ కోచ్/పీ. ఈ. టీ. వివేక్ రన్వాల్ పర్యవేక్షణలో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందించారు. కోచ్‌లు హమీద్ (తారిఖ్ అలీ), రింకూ సింగ్ అందించిన శిక్షణ కూడా విజయానికి దోహదపడింది. జట్టు విజయంపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

శనివారం,
అక్టోబర్ 03 2026

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం



# ఆరోగ్య చికిత్స కోసం

## రూ.5 లక్షల ఎల్ఓసీ అందజేత



**జోగులాంబ గద్వాల జోర్దార్ ప్రతినిధి:**వడ్డేపల్లి మండలం శాంతినగర్‌కు చెందిన నాయక భీమ్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో మెరుగైన వైద్యం కోసం రూ.5 లక్షల విలువైన ఎల్ఓసీ పత్రాన్ని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అందజేశారు. ఈ సందర్భంగా భీమ్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# హుజురాబాద్ సబ్ జైల్లో వైభవంగా

## గాంధీ జయంతి, ఖైదీల సంక్షేమ దినోత్సవం




**హుజురాబాద్,జోడిదార్ ప్రతినిధి:**హుజురాబాద్ సబ్ జైలు ఆవరణలో మహాత్మా గాంధీ 157 వ జయంతిని పురస్కరించుకుని జయంతి వేడుకలతో పాటు ఖైదీల సంక్షేమ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ న్యాయమూర్తి కే కిరణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ముందుగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం ఖైదీలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారునే పశ్చాత్తాపం చెంది జైలు జీవితం తర్వాత మంచి పౌరులుగా సమాజంలో జీవించాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ సందర్భ ంగా ఖైదీల కోసం నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు న్యాయమూర్తి చేతులమీదుగా బహుమతులను ప్రధా నం చేశారు.

ఈ కార్యక్రమంలో సబ్ జైలు ఇన్చార్జి అసిస్టెంట్ డిప్యూటీ జైలర్ తాళ్లపల్లి సురేష్ తో పాటు కవి రచయిత డాక్టర్ నాగుల సత్యం గౌడ్ జైలు సిబ్బంది ఇతర ముఖ్యులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడల్లో

## ఏసీపీ మాధవికి ఐదు పతకాలు



**జమ్మికుంట,జోర్దార్ ప్రతినిధి:**రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడా పోటీల్లో హుజూరాబాద్ ఏసీపీ వి. మాధవి సత్తా చాటారు. టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి నాలుగు స్వర్ణాలు, ఒక రజత పతకం సాధించారు. ఈ సందర్భంగా జమ్మికుంట సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ మాధవిని పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. క్రీడల్లో ఆమె విజయం పోలీస్ సిబ్బందికి స్ఫూర్తిదాయకమని సీఐ రామకృష్ణ కొనియాడారు. కార్యక్రమంలో ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొని అభినందనలు తెలిపారు.

# వరంగల్ బాలికల కబడ్డీ జట్టుకు

## మున్నూరు కాపు పరపతి సంఘం ఆర్థిక చేయూత



- రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేత

**వరంగల్ జోర్దార్ ప్రతినిధి:** 36వ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బాలికల కబడ్డీ టోర్నమెంట్‌కు బయలుదేరుతున్న వరంగల్ జిల్లా బాలికల జట్టుకు మున్నూరు కాపు పరపతి సంఘం తరఫున ప్రోత్సాహకంగా రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. టోర్నమెంట్‌లో వరంగల్ జట్టు ఉత్తమ ప్రతిభ కనబరిచి విజయంతో తిరిగి రావాలని సంఘం ప్రతినిధులు ఆకాంక్షించారు.

క్రీడాకారులకు భవిష్యత్తులోనూ తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని మున్నూరు కాపు పరపతి సంఘం ప్రతినిధులు తెలిపారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో, జట్టు సమిష్టి కృషితో ముందుకు సాగి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సంఘం అధ్యక్షుడు బండి కుమారస్వామి సూచించారు.

ఈ సందర్భంగా వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ తరఫున మున్నూరు కాపు పరపతి సంఘం అధ్యక్షులు, పాలకవర్గ సభ్యులను చిరు సన్మానంతో సత్కరించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలో మున్నూరు కాపు పరపతి సంఘం గౌరవ అధ్యక్షులు తోట రమేష్, అధ్యక్షుడు బండి కుమారస్వామి, ఉపాధ్యక్షుడు వగిలిశెట్టి అనిల్, కార్యదర్శి లక్కాకుల శ్యామ్, కోశాధికారి బండి మోహన్, సూపర్‌వైజర్ తోట సుధాకర్ పాల్గొన్నారు.

వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ మహమ్మద్ అబ్దుల్లా ఖాన్, కోశాధికారి ముఖర్జీ, జాయింట్ సెక్రెటరీ మీర్జా ఇనాయత్ (అత్తర్), శ్రీకాంత్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

# కుంకుమేశ్వర ఆలయ అభివృద్ధికి మరింత కృషి

## చైర్మన్‌గా రాజేశ్వరరావు ప్రమాణ స్వీకారం

- ఆదాయ వనరుల పెంపునకు ప్రణాళికలు



**హన్మకొండ జోర్దార్ ప్రతినిధి:**పరకాల పట్టణంలోని శ్రీ భవాని కుంకుమేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్‌గా కొలుగూరి రాజేశ్వరరావు,ధర్మకర్త మండలి సభ్యులు రంగు సరోజన, తోట రవి, గోవింద సత్యనారాయణ, నవీన్ , ప్రజాపత్ సవాల్ రామ్, శ్రీధర్ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆశీస్సులతో గతంలో చైర్మన్‌గా పనిచేసిన సమయంలో దేవస్థానానికి 4.11 ఎకరాల భూమి సాధించడంతో పాటు హద్దులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహా రుద్రయాగం, హిందూ సమ్మేళనం, కార్తీక మాస ఉత్సవాలను ఘనంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు.

మరోసారి చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో ఆలయ ఆదాయ వనరులను పెంచేందుకు పెట్రోల్ బంక్, షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు దిశగా కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆశీస్సులు, కమిటీ సభ్యులు, భక్తుల సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు.

**సేవా దృక్పథంతో పనిచేయాలి**

ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ చైర్మన్ కొలుగూరి రాజేశ్వరరావుతో పాటు నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ చైర్మన్ పదవిని లాభాపేక్ష లేకుండా సేవా దృక్పథంతో నిర్వహించాలని సూచించారు. దేవుడి సేవ చేయగలరనే నమ్మకంతోనే కమిటీ సభ్యులకు బాధ్యతలు అప్పగించినట్లు చెప్పారు. రాజేశ్వరరావుకు గతంలో చైర్మన్‌గా పనిచేసిన అనుభవం ఉందన్నారు.

మాజీ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు ఆలయ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, పార్టీలకు అతీతంగా ఆయనను మరోసారి చైర్మన్‌గా కొనసాగించాలని తాను కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. మొలుగూరి భిక్షపతి సర్పంచ్‌గా ఉన్నప్పటి నుంచే ఆలయ భూమి కోసం ప్రయత్నించారని, తన హయాంలో భూమి సమకూరడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు.

**రూ.5 కోట్లతో అభివృద్ధి పనులు**

కుంకుమేశ్వర ఆలయ అభివృద్ధికి రూ.5 కోట్లతో చేపట్టనున్న పనులకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన జరిగినట్లు రేవూరి తెలిపారు. కంచి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతిని కలిసి ఆలయ కుంభాభిషేకం నిర్వహించే అంశంపై చర్చించినట్లు చెప్పారు. కుంకుమేశ్వర స్వామి ఆశీస్సులతో పరకాల పట్టణ అభివృద్ధికి ముందుకు సాగుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో నాగేశ్వరరావు, ఆలయ వంశాను గత ఆచార్యులు కోమాళ్ళపల్లి నాగభూషణ శర్మ, మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్‌కుమార్ ఓ సి సంఘాల రాష్ట్ర కన్వీనర్ గోపు జై పాల్ రెడ్డి,కామిడి సతీష్ రెడ్డి మాడుగుల పాపి రెడ్డి మున్సిపల్ సిబ్బంది, పుర ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

# చిగురులకే ఆశలెక్కువ..!

ఒకరి కోసమొకరు చూసుకునే
ఎదురుచూపుల్లో నిరాశలెక్కువ
సాముహిక జీవనంలోని
ఒంటరితనాల్లో భయాలెక్కువ..!

లక్ష్యసాధన గమనాల్లోని
కలవరింతల నిద్రల్లో స్వప్నాలెక్కువ
ఆగినచోటల్లా ఇచ్చిన హామీల్లో
అమలు చేయలేని వాగ్దానాలెక్కువ..!

పనిలో నిమగ్నమై సాగుతుంటే
అడుగడుగున వ్యాఖ్యానాలెక్కువ
ఆశయాల దారిలో ఆటంకాలను
చేధించటంలో నిర్లక్ష్యమెక్కువ..!

రాలిపోయిన ఎండిన ఆకుల కంటే
కొంగ్రొత్తగా మొలిచిన చిగురులకే ఆశలెక్కువ
గడిచిన కాలంలోని గాయాల కంటే
వర్తమానంలోని జీవనానికే విలువెక్కువ..!



గోపగాని రవీందర్
9440979882

# భద్రకాళీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల

## ఏర్పాట్లపై సమీక్ష



**వరంగల్,జోర్దార్ ప్రతినిధి:**వరంగల్ చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానాన్ని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి శుక్రవారము సందర్శించారు.

ఈ నెల 11 నుంచి ప్రారంభమయ్యే శ్రీ భద్రకాళీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలకు పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, భద్రత, పార్కింగ్ ఏర్పాట్లపై సమీక్షించారు.ఆలయం చుట్టూ నిర్మిస్తున్న మాడవీధుల పనుల పురోగతిని పరిశీలించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నేతృత్వంలో దాతల సహకారంతో సుమారు రూ.కోటి వ్యయంతో తమిళనాడులోని కన్యాకుమారి శిల్పులు ప్రవీణ్ చారి ఆధ్వర్యంలో తయారు చేస్తున్న శ్రీపర్ణికా దారుమయ (టేకు) రథాన్ని నవరాత్రి ఉత్సవాల్లోపు అందుబాటులోకి తీసుకురావాలని శిల్పులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో కుడా అధికారులు, సీపీఓ అజిత్ రెడ్డి, ఈఈ భీంరావు, దేవస్థానం ఈఓ రామల సునీత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బస్సులు ఆపరా..

## రోడ్డెక్కిన శాలపల్లి ప్రజలు!

- ఆర్టీసీ బస్సుల నిలుపుదల కోసం రాస్తారోకో
- విద్యార్థులు, మహిళలు, కార్మికులకు తీవ్ర ఇబ్బందులు

**హుజురాబాద్ జోర్దార్ ప్రతినిధి:**ఆర్టీసీ బస్సులు గ్రామంలో నిలపడం లేదని ఆరోపిస్తూ శాలపల్లి ఇందిరానగర్ గ్రామస్థులు రోడ్డెక్కారు. హుజురాబాద్--జమ్మికుంట ప్రధాన రహదారిపై గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట గ్రామ ప్రజలు, పంచాయతీ పాలకవర్గం బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు.

హుజురాబాద్--జమ్మికుంట ప్రధాన రహదారిపై నిత్యం వందలాది ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ శాలపల్లి ఇందిరానగర్‌లో బస్సులు నిలపడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ప్రయాణాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు.

**విద్యార్థులు.. మహిళలు.. కార్మికుల అవస్థలు**

గ్రామం నుంచి నిత్యం ఉద్యోగాలు, కూలి పనులకు వెళ్లే కార్మికులు, విద్యార్థులు, మహిళలు బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్థులు పేర్కొన్నారు. బస్సులు నిలిపేలా చర్యలు తీసుకోవాలని పలుమార్లు హుజురాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని ఆరోపించారు.

దీంతో సమస్యపై అధికారుల దృష్టిని ఆకర్షించేందుకు గ్రామస్థులు ప్రధాన రహదారిపై బైఠాయించారు. "వీ వాంట్ జస్టిస్" అంటూ నినాదాలు చేస్తూ ఆర్టీసీ అధికారులు స్పందించి గ్రామంలో బస్సుల నిలుపుదలకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**బస్సు స్టాప్ ఏర్పాటు చేయాలని డిమాండ్**

గ్రామ ప్రజల రవాణా సమస్యను అధికారులు తక్షణమే పరిష్కరించాలని, హుజురాబాద్--జమ్మికుంట ప్రధాన రహదారిపై శాలపల్లి ఇందిరానగర్‌కు ప్రత్యేక బస్సు స్టాప్ సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు కోరారు. ఆర్టీసీ అధికారులు గ్రామంలో బస్సుల నిలుపుదలపై స్పష్టమైన నిర్ణయం తీసుకుని విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, కార్మికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఆందోళనలో గ్రామ సర్పంచ్ ప్రవీణ్, ఉప సర్పంచ్ అశోక్, వార్డు సభ్యులు, మహిళలు, యువకులు, గ్రామస్థులు వందలాది మంది పాల్గొన్నారు.

# ఆమాత్యునికి అభినందనలు తెలిపిన ఇనుముల

- ఎమ్మెల్యేగా రాజకీయ ప్రస్థానానికి 27 ఏళ్లు పూర్తి



**మంథని జోర్దార్ ప్రతినిధి:** మంథని నియోజకవర్గ రాజకీయాల్లోకి ప్రవేశించి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికై 27 ఏళ్లు పూర్తయిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మంత్రి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబును ఇనుముల కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కలిసి అభినందించారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబును శాలువాతో సత్కరించారు.

1999లో మాజీ స్పీకర్ స్వర్గీయ డి. శ్రీపాదరావు మరణానంతరం శ్రీధర్ బాబు రాజకీయాల్లోకి ప్రవేశించారు. 1999 సెప్టెంబర్ 18న జరిగిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో మంథని నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి, అక్టోబర్ 6న వెలువడిన ఫలితాల్లో సమీప టీడీపీ అభ్యర్థి స్వర్గీయ చందుపట్ల రాంరెడ్డిపై 15 వేలకు పైగా ఓట్ల మెజారిటీతో తొలిసారి విజయం సాధించారు.

తొలి విజయంతో ప్రారంభమైన శ్రీధర్ బాబు రాజకీయ ప్రస్థానం కొనసాగుతూ వచ్చింది. ఇప్పటివరకు ఐదుసార్లు మంథని ఎమ్మెల్యేగా ఎన్నికై, రెండుసార్లు రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేగా ఆయన రాజకీయ ప్రస్థానానికి 27 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఇనుముల కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.

శ్రీధర్ బాబు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత పదవులు చేపట్టాలని వారు ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో మంథని మున్సిపల్ 7వ వార్డు కాంటెస్టెడ్ కౌన్సిలర్ ఇనుముల విజేత, మంథని మాజీ ఉపసర్పంచ్, హైకోర్టు న్యాయవాది ఇనుముల సత్యనారాయణ పాల్గొన్నారు.

# గాంధీ జయంతి రోజున అక్రమ మద్యం విక్రయం

## కేయూసీ పోలీసుల దాడులు

**హసన్ పర్తి,జోర్దార్ ప్రతినిధి:**గాంధీ జయంతి సందర్భంగా మద్యం విక్రయాలపై నిఘా పెట్టిన కేయూసీ పోలీసులు అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారిపై దాడులు నిర్వహించారు. కేయూసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుండ్ల సింగారం, గణేష్‌నగర్ ప్రాంతాల్లో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా,జయపాల్ రాజు తన కిరాణా దుకాణంలో ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించారు.దీంతో పోలీసులు అతని వద్ద నుంచి రూ.12,470 విలువైన మద్యం బాటిళ్లను, మరో వ్యక్తి వద్ద నుంచి రూ.1,12,430 విలువైన మద్యం బాటిళ్లను పట్టుకున్నారు.

రెండు ఘటనల్లో కలిపి మొత్తం రూ.1,24,900 విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు కేయూసీ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్ వెల్లడించారు.

గాంధీ జయంతి సందర్భంగా ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# బంజారాహిల్స్‌లో అర్ధరాత్రి కారు బీభత్సం

## 20 ఏళ్ల యువకుడికి స్వల్ప గాయాలు

హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ రోడ్ నంబర్-1లో అర్ధరాత్రి కారు బీభత్సం సృష్టించింది. అతివేగంగా దూసుకొచ్చిన మహీంద్రా స్కార్పియో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. ప్రమాదంలో కారు నడుపుతున్న 20 ఏళ్ల యువకుడు రూప్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

వేగంగా వచ్చిన స్కార్పియో ఒక్కసారిగా అదుపు తప్పి చెట్టును ఢీకొనడంతో భారీ శబ్దం వినిపించింది. దీంతో స్థానికులు అప్రమత్తమై పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పంజాగుట్ట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గురైన వాహనాన్ని పరిశీలించారు. వాహనాన్ని 20 ఏళ్ల రూప్ నడుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు. అతను మద్యం మత్తులో వాహనం నడిపి ఉంటాడని అనుమానిస్తున్నారు. ప్రమాద సమయంలో కారులో మరెవరైనా ఉన్నారా? వాహనం ఏ వేగంతో ప్రయాణిస్తోంది? అనే వివరాలపై ఆరా తీస్తున్నారు.ప్రమాదంలో ఎవరికీ తీవ్ర గాయాలు కాకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. ఘటనకు దారితీసిన కారణాలపై పంజాగుట్ట పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు



RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం

శనివారం,
అక్టోబర్ 03 2026



# ఇంచంపల్లిలో

## జల విద్యుత్ కేంద్రం నిర్మించాలి

- కుల సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ పీక కిరణ్ డిమాండ్!

(భూపాలపల్లి /పలిమెల జోర్దర్ ప్రతినిధి)రాష్ట్ర ప్రభుత్వం నిన్న జరిగిన కేబినెట్ భేటీలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల ఈపీసీ ఒప్పందాలను రద్దు చేసి, కొత్త టెండర్ల ద్వారా పునఃప్రారంభించాలని తీసుకున్న నిర్ణయాన్ని పీక కిరణ్ స్వాగతించారు. ఈ క్రమంలోనే దశాబ్దాలుగా నలిగిపోతున్న ఇంచంపల్లి ప్రాజెక్టును మళ్లీ ప్రారంభించి, అక్కడ భారీ జల విద్యుత్ కేంద్రాన్ని నిర్మించాలని కుల సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ పీక కిరణ్ డిమాండ్ చేశారు.

తాజాగా రాష్ట్ర మంత్రివర్గం భవిష్యత్ విద్యుత్ డిమాండ్‌ను తట్టుకునేందుకు 7,800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తులకు సంబంధించి టెండర్లు పిలవాలని, పాత సాగునీటి ప్రాజెక్టులకు కొత్త ఊపిరి పోయాలని నిర్ణయించిందని ఆయన గుర్తుచేశారు. ఇదే సందర్భంలో మారుమూల అటవీ ప్రాంతమైన పలిమెల మండలంలో ఉన్న ఇంచంపల్లి వద్ద జల విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత రూపురేఖలే మారిపోతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

ఇంచంపల్లిలో జల విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణం చేపడితే స్థానిక యువతకు భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి. దీనివల్ల పొట్టచేతపట్టుకుని వేరే ప్రాంతాలకు పోయే వలసలు పూర్తిగా తగ్గుతాయి. అని అన్నారు.

మంత్రి శ్రీధర్ బాబు చొరవ చూపాలి స్థానిక సంక్షేమం, అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపే ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవ తీసుకుని ఈ మారుమూల ప్రాంతానికి జల విద్యుత్ కేంద్రాన్ని మంజూరు చేయించాలని పీక కిరణ్ విజ్ఞప్తి చేశారు.

# ఇందిరానగర్‌లో బస్సులు ఆపాలని

## గ్రామస్తుల ధర్నా




హుజూరాబాద్,జోర్దార్ ప్రతినిధి:హుజూరాబాద్ మండలం శాలపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఇందిరానగర్‌లో ఆర్టీసీ బస్సులు ఆపడం లేదని గ్రామస్తులు శుక్రవారం రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. సుమారు 100 మంది మహిళలు, విద్యార్థులు, యువకులు, గ్రామస్తులు పాల్గొని ప్రతి రిక్వెస్ట్ స్టేజీలో బస్సులు ఆపాలని డిమాండ్ చేశారు.

సర్పంచ్ కోడిగూటి ప్రవీణ్, వార్డు సభ్యులు పాల్గొని సమస్యను పరిష్కరించాలని కోరారు. పలుమార్లు డిపో మేనేజర్‌కు విన్నవించినా స్పందన లేకపోవడంతో ధర్నా చేపట్టినట్లు తెలిపారు.

సమాచారం అందుకున్న ఎస్ఐ రవి, ఏఎస్ఐలు సంఘటనా స్థలానికి చేరుకుని డిపో మేనేజర్‌తో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ధర్నా విరమించారు.

## కుక్క కరిచినా, గోళ్లతో గాయం చేసినా ఎంతో ప్రమాదకరం

# వెంటనే చికిత్స తీసుకోవాలి.. ఎందుకంటే



కుక్క కాటు లేదా గోళ్లతో చేసిన గాయం చిన్నదిగా కనిపించినా, రేబిస్ ప్రమాదం ఉన్నప్పుడు ఏమాత్రం నిర్లక్ష్యం చేయకూడదు. రేబిస్ అనేది కేంద్ర నాడీ వ్యవస్థపై ప్రభావం చూపించే వైరస్ వ్యాధి. ఒకసారి వ్యాధి లక్షణాలు కనిపించడం ప్రారంభమైన తర్వాత ఇది దాదాపు ప్రాణాంతకంగా మారుతుంది. అయితే జంతువు కరిచిన వెంటనే సరైన ప్రథమ చికిత్స, అవసరమైన రేబిస్ టీకా, ఇతర చికిత్సలు తీసుకుంటే ఈ వ్యాధిని నివారించవచ్చు. ప్రపంచవ్యాప్తంగా మానవుల్లో వచ్చే రేబిస్ కేసుల్లో దాదాపు 99 శాతం కుక్కల వల్లే వస్తున్నాయి. భారత్‌లో ప్రతి ఏడాది సుమారు 91 లక్షల జంతు కాటు ఘటనలు జరుగుతుండగా, వాటిలో మూడు వంతులకు పైగా కుక్కల వల్లే సంభవిస్తున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాలు చెబుతున్నాయి. అందుకే కుక్క కాటు లేదా అనుమానాస్పదంగా దాడి చేసిన వెంటనే చికిత్స తీసుకోవడం చాలా ముఖ్యం.

### ప్రథమ చికిత్స చేయాలి..

కుక్క కరిచిన వెంటనే ముందుగా గాయాన్ని కనీసం 15 నిమిషాల పాటు సబ్బు, ప్రవహించే నీటితో శుభ్రంగా కడగాలి. గాయాన్ని కేవలం తుడవడం లేదా కొద్దిసేపు నీటితో కడగడం సరిపోదు. ఇలా కడగడం వల్ల గాయంపై ఉన్న లాలాజలం, వైరస్ పరిమాణాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. అందుబాటులో ఉంటే కడిగిన తర్వాత అయోడిన్ కలిగిన లేదా వైరస్‌ను నిర్వీర్యం చేసే ద్రావణాన్ని ఉపయోగించవచ్చు. అయితే గాయంపై కారం పొడి, మొక్కల రసాలు, ఆమ్లాలు, క్షారాలు లేదా ఇతర హానికరమైన పదార్థాలను రాయకూడదు. ఇవి రేబిస్‌ను నివారించకపోగా కణజాలానికి మరింత నష్టం కలిగిస్తాయి. గాయం చిన్నదిగా ఉన్నా వెంటనే ఆరోగ్య కేంద్రానికి లేదా యాంటీ రేబిస్ క్లినిక్‌కు వెళ్లి వైద్యుల సలహా తీసుకోవాలి.

### ఇలా జరిగితే ఇంకా జాగ్రత్త అవసరం..

ప్రతి కుక్కను తాకిన సందర్భంలో రేబిస్ టీకా అవసరం ఉండదు. జంతువును తాకడం, ఆహారం పెట్టడం లేదా చెక్కుచెదరని చర్మంపై జంతువు నాకడం వంటి వాటిని సాధారణంగా రేబిస్ ప్రమాదంగా పరిగణించరు. చర్మంపై స్వల్పంగా చేసిన గాయాలు లేదా రక్తస్రావం లేకుండా చర్మం దెబ్బతిన్న సందర్భాల్లో గాయాన్ని కడిగి వెంటనే రేబిస్ టీకా తీసుకోవాల్సి ఉంటుంది. చర్మాన్ని చీల్చేలా కాటు లేదా గోళ్ల గాయం ఉండడం, గాయపడిన చర్మం లేదా కళ్లు, నోటి వంటి శ్లేష్మ పొరలపై జంతువు లాలాజలం పడడం వంటి తీవ్రమైన పరిస్థితుల్లో గాయాన్ని శుభ్రం చేయడంతోపాటు వెంటనే రేబిస్ టీకా, అవసరమైన సందర్భాల్లో రేబిస్ ఇమ్యూనోగ్లోబులిన్ తీసుకోవాలి. ఇంతకుముందు రేబిస్ టీకా పూర్తి కోర్సు తీసుకున్నవారికి సాధారణంగా ఇమ్యూనోగ్లోబులిన్ అవసరం ఉండదు. టీకా ఎన్ని డోసులు, ఏ రోజుల్లో తీసుకోవాలనేది గతంలో టీకా తీసుకున్నారా లేదా, గాయం తీవ్రత, టీకా ఇచ్చే విధానం వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి వైద్యులు సూచించిన షెడ్యూల్‌నే పాటించాలి

# రాష్ట్రవ్యాప్తంగా చైతన్య యాజమాన్యాల ఫీజుల దోపిడీ..

# వసతులు మాత్రం శూన్యం

- ఫీజుల వసూళ్లలో దోపిడీ.. యూనిఫాం, పుస్తకాల పేరుతో అదనపు భారం
- ఆట స్థలం లేక క్లాస్ రూమ్ లోనే అసెంబ్లీ.

(రావుల రాజేశం జోర్దార్ స్టేట్ )




చిత్రం చెబుతున్న సాక్ష్యం అని ప్రచారం చేసుకుంటున్న సంస్థకు చెందిన ఫోటోలు ప్రస్తుతం చర్చనీయంగా మారాయి. నాలుగు ఫోటోల్లో చిన్నారులు ఇరుకైన తరగతి గదుల్లో, బెంచీల మధ్య ఇరుక్కుని చేతులు జోడించి ప్రార్థన, జనగణమన, వందేమాతరం చేస్తున్నారు. పిల్లలకి ఆట స్థలాలు లేక ఇలా క్లాస్ రూమ్ లోనే అన్నీ నిర్వహిస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ప్రతి ఏటా ఫీజుల దోపిడీ

రాష్ట్రవ్యాప్తంగా చైతన్య విద్యా సంస్థల యాజమాన్యాలు ఎప్పటిలాగే ప్రతి సంవత్సరం ఫీజుల దోపిడీ చేస్తూ తల్లిదండ్రులను వేధిస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. దీనికి తోడు ఈ సంవత్సరం కొత్తగా విద్యార్థులకు యూనిఫాం, అకడమిక్ టెక్స్ట్ బుక్స్ పేరుతో అదనంగా వసూలు చేస్తున్నారు.

### యూనిఫాం ఇవ్వకుండానే వేధింపులు

యూనిఫాం ఫీజులు వసూలు చేసి ఇప్పటికీ విద్యార్థులకు ఇవ్వకుండా వేధిస్తున్నారు. కొత్త యూనిఫాం అని చెప్పేది వారే, ఇవ్వకుండా ఆలస్యం చేసేది వారే. మళ్లీ విద్యార్థులు పాత యూనిఫాంతో పాఠశాలకు వస్తే 'యూనిఫాం డిఫాల్టర్' అని బయటే నిలబెడుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు.

### ర్యాంకుల కోసం అదనపు తరగతులు

హైస్కూల్ పిల్లలను సాయంత్రం 6 గంటలు, 7 గంటల వరకు స్కూల్ లోనే ఉంచి ఎక్స్ట్రా క్లాసుల పేరుతో తమ ర్యాంకుల కోసం వేధిస్తున్నారు. పిల్లల బాధ వర్ణనాతీతంగా ఉందని చెబుతున్నారు.

### కనీస వసతులు కరువు - ఫోటోలే నిదర్శనం

పాఠశాలలో ఆడుకోవడానికి క్రీడా మైదానం లేకపోవడం, తాగునీరు, టాయిలెట్లు వంటి కనీస వసతులు లేకుండా స్కూళ్లు నడుపుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. 4 బ్రాంచ్ ఫోటోలు ఈ ఆరోపణకు ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తున్నాయి. తల్లిదండ్రులు కోరినా "మేము ఏం చేయలేం" అని యాజమాన్యం నిర్లక్ష్య సమాధానం ఇస్తోందని విమర్శ.

### ఫీజు ఆలస్యమైతే పరీక్షలకు అడ్డు

ఫీజులు చెల్లించడంలో కొంచెం ఆలస్యమైతే విద్యార్థులను ఎగ్జామ్స్ రాయకుండా అడ్డుకుని మానసికంగా వేధిస్తున్నారు. ఇది విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపుతుందని విద్యార్థి సంఘాలు, మేధావి వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

టీచర్లపై అధిక పనిభారం, ఫీజు వసూళ్ల ఒత్తిడి యాజమాన్యం టీచర్లు, సిబ్బందిపై అధిక పనిభారం మోపుతూ విద్యార్థుల పెండింగ్ ఫీజులను టీచర్లతోనే తల్లిదండ్రులకు ఫోన్ చేయించి వసూలు చేయాలని హుకుం జారీ చేస్తోంది. ఇది అకౌంట్స్ విభాగం పని కాగా టీచర్లపై రుద్దుతున్నారు. సరిపడా సిబ్బందిని నియమించకుండా యాజమాన్యం చెప్పిందే వినాలని ఆర్డర్ వేస్తోంది. సిలబస్ పూర్తి కాకపోయినా, ఫీజులు వసూలు చేయకపోయినా జీతంలో కోత విధిస్తామని బెదిరిస్తున్నారు. సాయంత్రం 7 గంటల వరకు, సెలవు దినాల్లో కూడా పని చేయిస్తుండటంతో టీచర్లు కుటుంబంతో సమయం గడపలేక, ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు.

విద్యార్థులను మానసికంగా వేధించడం ఆపాలని, టీచర్ల పని గంటలు సాయంత్రం 4 గంటల వరకే పరిమితం చేయాలని డిమాండ్ వినిపిస్తోంది. విద్యాచట్టం ప్రకారం విద్యార్థులను సంతోషంగా చదువుకోనివ్వాలని, బలవంతపు ర్యాంకుల వేట కాకుండా భవిష్యత్తులో ఉన్నత స్థాయికి తీసుకెళ్లేలా ప్రోత్సహించాలని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

# ఇంటర్ విద్యలో అక్రమ- ఫైర్

# అనుమతులపై చర్యలేవి?

- అనుమతులు గ్రామీణ ప్రాంతానికి.. తరగతులు పట్టణంలో.. వందల మంది భవిష్యత్తుతో చెలగాటం
- ఫోర్జరీ ఫైర్ చీూజలతో 75 ప్రైవేట్ జూనియర్ కళాశాలలు.. బోర్డు అధికారుల మౌనం ఎందుకు?

(హైదరాబాద్ జోర్దార్ ప్రతినిధి రావుల రాజేశం)

### ఇంటర్ విద్యలో వింత పోకడ

2026-27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు పూర్తి కాకముందే, నిబంధనలకు విరుద్ధంగా 2027-28 సంవత్సరానికి అడ్మిషన్ టెస్ట్ కోసం బ్రోచర్ విడుదల చేసిన కార్పొరేట్ కళాశాల తీరు ఇంటర్ విద్య ఎటు పోతుందో చెబుతోంది. ఒక విద్యార్థికి ఏడాదికి ఐదు లక్షల రూపాయల వరకు ఫీజులు వసూలు చేస్తూ కార్పొరేట్ కబంధహస్తాల్లో ఇంటర్ విద్య నలుగుతోంది.

### అనుమతులు లేకున్నా తరగతుల నిర్వహణ - నారాయణ కేసు

మాదాపూర్, రంగారెడ్డి జిల్లాలో అడ్మిషన్ పొందిన వందల మంది విద్యార్థులకు ఎలాంటి అనుమతులు లేని భవనాల్లో తరగతులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. మిలానో టవర్స్, లక్ష్మి ఎలైట్, అర్జున హైట్స్ భవనాల్లో చదువుతున్న విద్యార్థులను నారాయణ జూనియర్ కళాశాల (60226), మెహిదీపట్నం, హైదరాబాద్ నుండి పరీక్ష ఫీజులు చెల్లించి బోర్డుకు ఫార్వార్డ్ చేస్తున్నారు. విచిత్రం ఏమిటంటే ఆ కళాశాలకు (60226) ఈ విద్యా సంవత్సరానికి బోర్డు గుర్తింపే లేదు.

### విద్యార్థుల ఆందోళన - యాజమాన్య వేధింపులు

విషయం తెలిసి వంద మందికి పైగా విద్యార్థులు, బోనఫైడ్ సర్టిఫికెట్ల కోసం వెళితే తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేశారని ఆరోపణ. ద్వితీయ సంవత్సర పుస్తకాల ఫీజుల పేరుతో ఒక్కొక్కరి నుండి రూ. 12,500 అదనంగా వసూలు చేశారు. ప్రథమ సంవత్సర ఒప్పంద ఫీజుకు భిన్నంగా ద్వితీయ సంవత్సరానికి తల్లిదండ్రులతో చర్చ లేకుండా ఏకపక్షంగా లక్ష రూపాయల వరకు ఫీజు పెంచారని, ప్రశ్నిస్తే విద్యార్థులను వేధిస్తున్నారని ఫిర్యాదు.

### ఫైర్, ఫోర్జరీ - 75 కళాశాలలపై చర్యలేవి?

దాదాపు 75 ప్రైవేట్ జూనియర్ కళాశాలలు ఫోర్జరీ, నకిలీ ఫైర్ చీూజలు సమర్పించాయని ఆధారాలతో ఫిర్యాదు చేసినా సిబ్బంది, బోర్డు అధికారులు స్పందించలేదనే విమర్శ ఉంది. బోర్డు సెక్రటరీ టాస్క్ ఫోర్స్‌ను పంపినా, తనిఖీకి వెళ్లిన డిప్యూటీ సెక్రటరీ, సూపరింటెండెంట్లు యాజమాన్యాలతో కుమ్మక్కై పెనాల్టీలు వేయకుండా, సీజ్ చేయకుండా వస్తున్నారనే ఆరోపణలు తీవ్రమైనవి.

### నిబంధనల ఉల్లంఘనల పరంపర

- ప్రాక్టికల్స్ కోసం ల్యాబ్ లు లేవు
- మానసిక ఒత్తిడి తగ్గించే కౌన్సెలింగ్ తరగతులు లేవు
- క్యాంపస్ లోనే పుస్తకాలు, మెటీరియల్ కొనాలని ఒత్తిడి చేసి వేల రూపాయల వసూలు
- డిమాండ్

అవినీతిపరులతో అంటకాగుతున్న ఐ×జూ సిబ్బంది, బోర్డు అధికారులపై చర్యలు తీసుకోవాలని, అక్రమ కళాశాలలను సీజ్ చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని విద్యావేత్తలు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. ఆధారాలతో ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారుల తీరుపై సమగ్ర విచారణ జరపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# రాష్ట్రస్థాయిలో సూపర్ ర్యాంక్.

# మెంటల్ టార్చర్ లో అదే ర్యాంక్

- 'ఫస్ట్ ర్యాంక్' ఫీవర్‌లో వ్యవసాయ శాఖ..!
- పిచ్చుక పై బ్రహ్మాస్త్రం ప్రయోగీస్తున్న డైరెక్టర్ గోపి ర్యాంకుల రగడలో పాలన...
- సిబ్బందిపై సమీక్షల దండయాత్ర
- ఫార్మర్ రిజిస్ట్రీ, డిజిటల్ పంటల సర్వే టార్గెట్లతో క్షేత్రస్థాయి సిబ్బందిపై ఒత్తిడి
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో ర్యాంకుల కోసం హడావుడి? కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారి పర్యవేక్షణపై సిబ్బంది అసంతృప్తి

(హైదరాబాద్ /వరంగల్ జోర్దార్ ప్రతినిధి)

స్టేట్లో అన్ని సేవల్లో ఆ జిల్లా ఫస్ట్ గా ఉన్నప్పటికీ ఆ జిల్లా అధికారి నానా టార్చర్ పెడుతూ ఫీల్ స్థాయి ఉద్యోగులను నరకం చూపిస్తున్నారు ఏమైనా అంటే సరెండర్ చేస్తాను సస్పెండ్ చేస్తాను కాకమ్మ కబుర్లు చెప్పొద్దంటూ తిట్ల దండం అందుకుంటున్నారుఉమ్మడి వరంగల్ జిల్లాలో జిల్లాలో వ్యవసాయ శాఖకు సంబంధించిన ఫార్మర్ రిజిస్ట్రీ, డిజిటల్ పంటల సర్వే ర్యాంకులపై అధికార యంత్రాంగం చూపుతున్న ప్రత్యేక శ్రద్ధ క్షేత్రస్థాయి సిబ్బందిలో అసంతృప్తికి దారితీస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.ర్యాంకుల్లో ముందంజలో నిలవాలనే లక్ష్యంతో తరచూ సమీక్షలు, ఆన్‌లైన్ సమావేశాలు నిర్వహిస్తున్నారని, వీటి కారణంగా ఇప్పటికే వివిధ పనిభారాలతో ఉన్న క్షేత్రస్థాయి సిబ్బందిపై అదనపు ఒత్తిడి పడుతోందని ఉద్యోగ వర్గాలు పేర్కొంటున్నాయి.

### ఉదయం 8 గంటలకైనా.. రాత్రి 7 గంటలకైనా సమావేశాలేనా?

ఉమ్మడి జిల్లాలో ఓ కలెక్టర్ ఉదయం 8 గంటలకు లేదా సాయంత్రం 7 గంటల సమయంలో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారని, దీనిపై క్షేత్రస్థాయి సిబ్బందిలో అసంతృప్తి వ్యక్తమవుతోందని సమాచారం.ప్రజల మధ్య పనిచేసే సిబ్బంది తమ విధుల్లో భాగంగా క్షేత్రస్థాయి పర్యటనలు, రైతుల సమస్యల పరిష్కారం, వివిధ ప్రభుత్వ కార్యక్రమాల అమలు వం టి బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుందని ఉద్యోగులు చెబు తున్నారు. ఈ నేపథ్యంలో పని సమయాలకు వెలుపల సమీక్షలు నిర్వహించడం తమపై అదనపు మానసిక ఒత్తిడిని పెంచుతోందని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.

### ర్యాంకుల కోసం పరుగులు... ప్రజా సమస్యల సంగతేంటి?

వ్యవసాయ శాఖ పనితీరును కొలిచే ర్యాంకులు, టార్గెట్లు ముఖ్యమే అయినప్పటికీ.. వాటి కోసం నిర్వహించే సమీక్షల ప్రభావం ఇతర ప్రభుత్వ సేవలపై పడకుండా చూడాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.వైద్యం, విద్య, తాగునీరు, పారిశుద్ధ్యం, గ్రామీణ మౌలిక వసతులు వంటి కీలక అంశాలపై కలెక్టర్ లకు కూడా సమాన స్థాయిలో పర్యవేక్షణ ఉండాలని ప్రజలు కోరుతున్నారు.

### 'అంకెలు' మాత్రమే ప్రగతికి కొలమానమా?

ఫార్మర్ రిజిస్ట్రీ, డిజిటల్ పంటల సర్వేలో లక్ష్యాలు సాధించడం ద్వారా ర్యాంకులు మెరుగుపడవచ్చు. అయితే ర్యాంకులతో పాటు క్షేత్రస్థాయిలో రైతులకు అందుతున్న సేవలు, సిబ్బంది పనిభారం, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలనూ పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది.ఉద్యోగులపై సమీక్షలు, టార్గెట్ల ఒత్తిడి పెంచడం కంటే.. అందుబాటులో ఉన్న సిబ్బంది, సమయం, వనరులకు అనుగుణంగా లక్ష్యాలను నిర్ణయించి, సమతుల్యమైన పరిపాలన కొనసాగించాలని ఉద్యోగ వర్గాలు కోరుతున్నాయి.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం



# అన్నీ ఇచ్చినా ఆబ్సెంట్ జాబితాలోకి - అడిగితే కొత్తగా అప్లై చేసుకోవాలంటూ ఉచిత సలహాలు

**హైదరాబాద్:** హైదరాబాద్‌లోని ఉప్పుగూడకు చెందిన ఓ కుటుంబంలో నలుగురు ఓటర్లు ఉన్నారు. వారు ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో భాగంగా బీఎల్‌వోకు ఎన్యూమరేషన్ పత్రాలను నింపి ఇచ్చారు. బీఎల్‌వోలు ఆ ఎన్యూమరేషన్ పత్రాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అయితే వారి పేర్లను ముసాయిదా ఓటర్ల జాబితాలో ప్రచురించాలి.ఆపై అనామలీస్, 2002-సర్ మ్యాపింగ్‌లో తేడాలుంటే వారికి నోటీసులు ఇవ్వాలి. లేదంటే ఆ ఎన్యూమరేషన్ పత్రాలు సరిగ్గా ఉన్నట్లు లెక్క. అయితే, చిరునామా దొరకలేదన్న కారణంతో ఈ నలుగురి పేర్లను ఏఎస్‌డీడీ (ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెత్, డూప్లికేట్) జాబితాలో చేర్చారు. ఈ తరహాలోనే ఈ పోలింగ్ బూత్ పరిధిలో 598 మంది ఓటర్లకు ఇదే పరిస్థితి ఎదురైంది.సమస్య ఏమిటని ప్రశ్నిస్తేఈ సమస్యలు ఎదుర్కొంటున్న వారిని మళ్లీ ఫారం-6 ద్వారా కొత్తగా ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని బీఎల్‌వోలు సూచిస్తున్నారు. తెలంగాణలో 'సర్' తప్పిదాల పరంపరలో ఇదొకటి. ఎన్యూమరేషన్? పత్రాలను సమర్పించిన ఓటర్లనూ ఏఎస్?డీడీ జాబితాలో ఉంచి ముసాయిదా జాబితాలో ప్రచురించకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 2,64,87,213 ఎన్యూమరేషన్ పత్రాలకు డిజిటలైజేషన్



చేశారు.ఓటర్లు సమర్పించిన పత్రాల్లో అనుమానాలున్న 92.87 లక్షల మంది ఓటర్లకు నోటీసులు అందించారు. అన్‌కలెక్టబల్ విభాగం కింద శాశ్వతంగా చిరునామా మారడం, చిరునామాలో లేకపోవడం, మృతి చెందడం, డూప్లికేట్ (ఏఎస్‌డీడీ) కింద మరో 73.39 లక్షల మంది ఓటర్లను తొలగించారు.బీఎలవోలు అప్‌లోడ్‌చేయలేదని విమర్శలుఏకపక్షంగా ఓటర్లను తొలగించారని, బీఎల్‌వోలు అనేక ప్రాంతాల్లో ఎన్యూమరేషన్ పత్రాలను అందించలేదని రాజకీయ పార్టీలు ఆరోపించాయి. వివిధ ప్రాంతాల్లో ఓటర్లు పత్రాలను పూర్తి చేసి ఇచ్చారు. అయినా బీఎల్‌వోలు వాటిని అప్‌లోడ్ చేయలేదని విమర్శలొస్తున్నాయి. ఏఎస్‌డీడీ జాబితాపై మరోసారి విచారణ చేపట్టాలని రాజకీయ పార్టీలు చీఫ్ ఎలక్టోరల్ అధికారికి వినతి పత్రాలు సమర్పించాయి. అయితే చివరి తేదీల్లో ఓటర్ల నుంచి వందల సంఖ్యలో ఎన్యూమరేషన్? పత్రాలు వచ్చాయి. దీంతో బీఎల్‌వోలు కొన్నింటిని మాత్రమే అప్‌లోడ్ చేసి మిగతావాటిని వదిలేశారన్న ఆరోపణలూ ఉన్నాయి. ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఈ సమస్య నెలకొంది.సక్రమంగా అమలు కావడం లేదునోటీసు జారీ అయిన ప్రతి ఓటరు ఇంటికి బీఎల్?వోలు తప్పనిసరిగా వెళ్లాల్సి ఉంటుంది. ఆపై వారికి నోటీసులను అందించాలని ఎన్నికల అధికారులు పదే పదే చెబుతున్నారు. అయితే ఈ ప్రక్రియ ఎక్కడా సక్రమంగా అమలు కావడం లేదు. అనేక ప్రాంతాల్లో బీఎల్‌వోలు ఇళ్లకు వెళ్లడం లేదు. వీరంతా దగ్గరలోని ఓ కమ్యూనిటీ భవనాల్లో కూర్చొని నోటీసులు తీసుకోవాలంటూ ఓటర్లకు ఫోన్లు చేస్తున్నారు. దీంతో వీలైన వాళ్లు వెళ్తున్నారు. అవగాహన లేని వారు, దూర ప్రాంతాల్లో ఉంటున్న వారు ఊరుకుంటున్నారు.రాష్ట్రంలో మొత్తం 92.88 లక్షల మందికి నోటీసులు రూపొందించారు. అయితే ఇంకా దాదాపుగా 10 లక్షల మందికి అవి అందలేదు. మరో 40 లక్షల మందికి ఇచ్చిన నోటీసుల గడువు ముగియడంతో వాటిని రద్దు చేసినట్లు సర్? గణాంకాలు చెబుతున్నాయి.

# రేవంత్‌రెడ్డి, కేటీఆర్ ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి



**సంగారెడ్డి జిల్లా, అక్టోబరు 2 :** కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల్లోని నేతలు దొంగలేనని ఆరోపించారు. (శుక్రవారం) సంగారెడ్డి జిల్లాలోని రామచంద్రపురంలో మీడియాతో ఎంపీ రఘునందన్ రావు మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ మంత్రి కేటీఆర్ ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని తెలంగాణ హైకోర్టుకు వారు లేఖ రాయాలని డిమాండ్ చేశారు.సోమవారం వరకు వారిద్దరూ ఉత్తరం రాయకపోతే స్వయంగా తానే హైకోర్టుకు ఈ విషయంపై ఉత్తరం రాస్తానని ఎంపీ రఘునందన్ తెలిపారు. లేదంటే మన ముగ్గురం వెళ్లి హైకోర్టు సిట్టింగ్ జడ్జికి ఉత్తరం ఇద్దామని చెప్పుకొచ్చారు. తన ఆస్తులపై కూడా విచారణ జరపాలని ఉత్తరం ఇస్తానని ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు.

# బొల్లారం ఆయుధాల చోరీ కేసు.. వెలుగులోకి సంచలన విషయాలు



**హైదరాబాద్:** మద్రాస్ రెజిమెంట్ ఆర్మీ ఆయుధాల చోరీ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. 10 రోజుల కస్టడీలో మల్లేశ్ నుంచి పోలీసులు కీలక వివరాలు రాబట్టారు. మల్లేశ్?కు కోల్?కతాకు చెందిన ఆయుధ వ్యాపారితో సంబంధాలు ఉన్నాయని, ఆయుధాలు అతనికే అమ్మేందుకు ప్రయత్నించా దన్న విషయం బయటపడింది. 2009లో ఆర్మీలో చేరిన మల్లేశ్‌కు ఆయుధాలపై ప్రత్యేక శిక్షణ పొందాడు. మల్లేశ్? ఏ కంటోన్మెంట్‌లో చేసినా ఆయుధాగారం బాధ్యతలే చేపట్టాడు. విధుల్లో నిర్లక్ష్యంతో పలుమార్లు మల్లేశ్‌పై క్రమశిక్షణ చర్యలు చేపట్టారు. మూడేళ్ల సర్వీస్ అవకాశం ఉన్నా తొలగించడంతో మల్లేశ్? కక్ష పెంచుకున్నాడు. 2022లో బీర్బల్ షా అనే వ్యక్తి ద్వారా కోల్‌కతాలో ఆయుధ వ్యాపారి అవల్‌దెయ్ మల్లేశ్‌కు పరిచయమయ్యాడు.ఆయుధాల చోరీ రోజు కెమెరాలపై ఫోమ్?ఆ తర్వాత అవల్ దెయ్ వద్ద రూ.10 వేలకు తుపాకీ కొనుగోలు చేశాడు. కానీ మల్లేశ్? దారి దోపిడీ యత్నం విఫలమై తుపాకీని స్వగ్రామంలో దాచారు. 2007లోనే అబ్రాబాద్, అచ్చంపేటలో ఇళ్ల చోరీల కేసుల్లో నిందితుడిగా మల్లేశ్‌ని గుర్తించారు. 2025లో ఆర్థిక ఇబ్బందుల వల్ల ఆర్మీ ఆయుధాల చోరీకి మళ్లీ తొలి ప్రణాళిక వేశారు. వెబ్‌సిరీస్‌లు, బ్యాంకు, బంగారు దుకాణాల దోపిడీ వీడియోలతో ప్రేరణ పొందారు.

# మెట్రో-ఆర్టీసీ ప్రయాణానికి కామన్ పాస్.. భట్టి విక్రమార్క చేతుల మీదుగా ఆవిష్కరణ

**హైదరాబాద్:** హైదరాబాద్, అక్టోబర్ 2: భాగ్యనగరంలో మెట్రో, ఆర్టీసీ సేవలకు కామన్ పాస్ అందుబాటులోకి వచ్చింది. (శుక్రవారం) ప్రజాభ వన్‌లో మెట్రో - ఆర్టీసీ కామన్ పాస్‌ను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం, వివేక్, అజారుద్దీన్ పాల్గొన్నారు. సీఎంతో కలిపి 15 మంది మంత్రులకు డబ్బులు ఇచ్చి మరీ వన్ డే ఆర్టీసీ - మెట్రో కామన్ పాస్‌ను డిప్యూటీ సీఎం కొనుగోలు చేశారు. (శనివారం) ఉదయం 10 గంటలకు బేగంపేట నుంచి ఆర్టీసీ - మెట్రో కామన్ పాస్ ద్వారా మెట్రో లో భట్టి విక్రమార్క, మంత్రులు ప్రయాణం చేస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. హైదరాబాద్‌ను ప్రపంచలోనే తలమానికంగా ఉండేలా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. భాగ్యనగరం దేశానికి దశదిశలా మారేలా చేస్తున్నామని చెప్పారు.మోస్ట్ లివబుల్‌సిటీగా హైదరాబాద్.హైదరాబాద్ మహానగరంలో ప్రస్తుతం రూ. 52,000 కోట్ల పనులు జరుగుతున్నాయని ఉపముఖ్యమంత్రి తెలిపారు. ఫేజ్ -2 లో రూ.38,000 కోట్ల మెట్రో పనులు చేపడుతున్నామని చెప్పారు.




రీజనల్ రింగ్ రోడ్ 366 కి.మి లతో... రూ.30, 627 అందుబాటులోకి తీసుకురాబోతున్నామని తెలిపారు. 21 రేడియల్ రోడ్లను అందుబాటులోకి తీసుకొ స్తున్నామని అన్నారు. మూసి పునర్నిర్మాణ పనులు చేపడుతున్నామని తెలిపారు. 30వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. మోస్ట్ లివబుల్ సిటీగా హైదారాబాద్‌ను తీర్చిదిద్దుతున్నామన్నారు. హైదారాబాద్‌లో పూర్తిగా ఎలక్ట్రిక్ బస్సులనే తిప్పాలని చూస్తున్నామని, ఆటోలకు రెట్రో ఫిట్‌మెంట్‌ను తీసుకొచ్చామని చెప్పారు. హిల్ట్ పాలసీని తీసుకొస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు.ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రజా రవాణా వ్యవస్థ బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని కల్పిస్తూ మహాలక్ష్మి పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీపై పెరిగిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందికి మంత్రి అభినందనలు తెలియజేశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి హైదరాబాద్ వరకు ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజా రవాణా వ్యవస్థ బలోపేతం అయితే ట్రాఫిక్ సమస్యలు, కాలుష్యం తగ్గుతాయన్నారు. ఆర్టీసీ, మెట్రో, ఆటో సేవలను సమన్వయం చేసి ప్రజలకు సులభమైన ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని అన్నారు. ఫస్ట్ మైల్ - లాస్ట్ మైల్ కనెక్టివిటీపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. ఆర్టీసీ, మెట్రోతో పాటు ఆటో రంగాన్ని కూడా ప్రజా రవాణా వ్యవస్థలో భాగస్వామ్యం చేస్తున్నామన్నారు.

# దానం ఎన్నిక రద్దయితే.. ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా నన్నే ప్రకటించాలి

**హైదరాబాద్:** ఖైరతాబాద్ ఉపఎన్నికపై ఉత్కంఠ కొనసాగుతోంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో దానం నాగేందర్ గెలుపును సవాల్ చేస్తూ కాంగ్రెస్ నేత విజయారెడ్డి దాఖలు చేసిన ఎన్నికల పిటిషన్ హైకోర్టులో పెండింగ్‌లో ఉంది. ఈ నేపథ్యంలో పిటిషన్‌పై తుది తీర్పు వచ్చే వరకు ఉపఎన్నిక నిర్వహించవద్దని ఆమె హైకోర్టును కోరారు. తాజాగా మీడియాతో మాట్లాడిన విజయారెడ్డి.. ఈ కేసుపై తనకు పూర్తి నమ్మకం ఉందని చెప్పారు.దానం నాగేందర్ ఎన్నికను సవాల్ చేస్తూ తాను ఎన్నికల పిటిషన్ వేశానని విజయారెడ్డి తెలిపారు. తన వాదనలను కోర్టు పరిగణనలోకి తీసుకుంటుందని నమ్ముతున్నానన్నారు. దానం నాగేందర్ ఎన్నిక చెల్లదని కోర్టు తేల్చితే.. తనను ఎమ్మెల్యేగా ప్రకటించే అవకాశం ఉందని ఆమె వ్యాఖ్యానించారు.ఎన్నికల పిటిషన్ తేలకముందే



ఉపఎన్నిక నిర్వహించే అవకాశంపై కూడా విజయారెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. ఒకవేళ తన పిటిషన్‌ను పక్కన పెట్టి ఉపఎన్నికకు వెళ్లే ప్రయత్నం జరిగితే.. దానికి గల కారణాలపై మళ్లీ న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని చెప్పారు.ఇదిలా ఉంటే ఖైరతాబాద్ స్థానానికి ఉపఎన్నిక నిర్వహణపై ఈసీ తాజాగా హైకోర్టుకు తన వైఖరిని స్పష్టం చేసింది. విజయారెడ్డి దాఖలు చేసిన ఎన్నికల పిటిషన్ తేలే వరకు ఉపఎన్నికకు నోటిఫికేషన్ ఇవ్వబోమని ఈసీ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. దీనిపై అధికారిక అఫిడవిట్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను అక్టోబర్ 6కి వాయిదా వేసింది.ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా ఉన్న దానం నాగేందర్ అనర్హతకు గురికావడంతో ఈ స్థానం ఖాళీ అయింది. ఆయన అనర్హతపై హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు కూడా సమర్థించింది. దీంతో ఉపఎన్నికకు మార్గం ఏర్పడింది. అయితే విజయారెడ్డి ఎన్నికల పిటిషన్ కారణంగా ఇప్పుడు ఉపఎన్నిక వ్యవహారం మళ్లీ న్యాయపరమైన చిక్కుల్లో పడింది. ఉపఎన్నిక జరిగితే కాంగ్రెస్ అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాల్సి ఉందని విజయారెడ్డి అన్నారు.

# కొడంగల్‌లో బీఆర్ఎస్ సభ.. రేవంత్‌కు చెమటలు పట్టిస్తాం



**హైదరాబాద్, అక్టోబర్ 2:** బీఆర్ఎస్ సభతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెమటలు పట్టిస్తామని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు.(శుక్రవారం) మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. త్వరలోనే కొడంగల్‌లో బీఆర్ఎస్ సభను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ఎక్కడైనా పర్యటించవచ్చని.. సిరిసిల్లలో బలప్రదర్శన చేయాల్సిన అవసరం లేదన్నారు. సిరిసిల్ల ఏమైనా పక్క రాష్ట్రంలో ఉందా అని ప్రశ్నించారు. రేవంత్.. సిద్దిపేటలో కూడా సభ పెడతానంటున్నారని అన్నారు. సిద్దిపేట సభ తర్వాత కొడంగల్‌లో బీఆర్ఎస్ సభ ఉంటుందని ప్రకటించారు. సిరిసిల్ల సభతో రేవంత్‌కు వచ్చిన మైలేజ్ కంటే నష్టమే ఎక్కువన్నారు.తాము కొడంగల్‌లో పెట్టే సభతో ముఖ్యమంత్రికి చెమటలు పడతాయని తలసాని అన్నారు. ఖైరతాబాద్ బైపోల్స్‌లో వంద శాతం బీఆర్ఎస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీలు మారటంతో దానం నాగేందర్‌పై ఖైరతాబాద్ ఓటర్లు ఆగ్రహంతో ఉన్నారని తెలిపారు. గతంలో ఓటు హక్కు వినియోగించుకోని వారు కూడా బైపోల్స్‌లో కసితో ఓటు వేస్తారన్నారు. జూబ్లీహిల్స్, కంటోన్మెంట్ ఉపఎన్నిక పరిస్థితి వేరని చెప్పుకొచ్చారు. డబ్బులు ఇచ్చినా ఓటర్లు కాంగ్రెస్‌కు ఓటు వేయరన్నారు. 'అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేసేంత సీన్ మేము ఏం చేశాం? బయట జరిగిన గొడవకు స్పీకర్‌కు ఏం సంబంధం' అని తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రశ్నించారు.

# బీజేపీలో గూటికి సీరియల్ ఆర్టిస్టులు.. ఆహ్వానించిన టీబీజేపీ చీఫ్



**హైదరాబాద్, అక్టోబర్ 2:** నగరంలోని బీజేపీ కార్యాలయంలో పలువురు సీరియల్ ఆర్టిస్టులు కాషాయం తీర్థం పుచ్చుకున్నారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు.. టీవీ ఆర్టిస్ట్ వేములపల్లి స్వర్ణలత సహా పలువురు సీరియల్ ఆర్టిస్టులను పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా రాంచందర్ రావు మీడియాతో మాట్లాడుతూ.. 'కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు అక్రమ సంపాదనల విషయంలో ఒకదానిపై ఒకటి ఆరోపణలు చేసుకుంటున్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు సంపాదించుకోవడం కాదు.. అసలు ప్రజలేం సంపాదించుకున్నారో ఎప్పుడైనా చెప్పారా.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వంద రోజుల్లో బీఆర్ఎస్ అవినీతి చిట్టా బయట పెడతామని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులైనా.. ఒక్కరినైనా జైలుకు పంపలేదు. అవినీతికి పాల్పడడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒకదానితో మరొకటి పోటీ పడుతున్నాయి. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన ప్రీమియం కట్టకుండా రాష్ట్ర ప్రభుత్వం రైతులను మోసం చేస్తోంది. తమ సమస్యను పరిష్కరించాలని గాంధీ భవన్ వద్ద ధర్నా చేస్తున్న టీచర్లను అరెస్ట్ చేసింది. ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే విద్యార్థులు, ఉపాధ్యాయులు, రైతులను పట్టించుకోవాలి. బీఆర్ఎస్, కాంగ్రెస్ తీరుతో ప్రజలు విసిగిపోయారు. రాష్ట్రంలో బీజేపీ ప్రత్యామ్నాయ పార్టీగా అవతరిస్తోంది' అని అన్నారు.

# రాష్ట్రంలో ఆటో ఛార్జీలు పెంపు - కనీస ఛార్జి రూ.30, ఆపై కిలోమీటర్‌కు రూ.14

: తెలంగాణలో ఆటో ఛార్జీలు పెంచుతూ రవాణాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. 1.6 కి.మీ. వరకు ఆటో కనీస ఛార్జ్ రూ.30 గా ఉండనుంది. కనీస ఛార్జ్ తర్వాత ప్రతి కిలోమీటర్‌కు రూ.14 వసూలు చేయనున్నారు. ప్రతి నిమిషానికి ఆటో డిటెన్షన్ ఛార్జీలు 75 పైసలుగా నిర్ణయించారు. రాత్రి 11 నుంచి తెల్లవారుజామున 5 వరకు ఒకటిన్నర శాతం అదనపు ఛార్జీలు వసూలు చేసేందుకు అనుమతి ఇచ్చారు. మూడు నెలల్లోపు డిజిటల్ మీటర్లు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది.అసలేం జరిగిందంటేఆటో కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్? చేస్తూ, ఆగస్టు 23 నుంచి బంద్? చేయాలని రాష్ట్ర ఆటో, యాప్? ఆధారిత రవాణా సంఘాల జాయింట్? యాక్షన్? కమిటీ గతంలో వెల్లడించింది. దీంతో ఆగస్టు 22వ తేదీన కార్మికులతో ప్రభుత్వం చర్చలు జరిపింది. ప్రభుత్వం తరఫున రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్?, అధికారులు చర్చల్లో పాల్గొన్నారు. ఆటో కార్మికుల డిమాండ్ల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి వారికి హామీ ఇచ్చారు. ఆర్టీసీ ఎలక్ట్రిక్? ఆటోలను



కొనుగోలు చేయనుందనే వార్తల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు. మంత్రి హామీతో బంద్? విరమించిన కార్మికులు, వారి ప్రతిపాదనలను రవాణా శాఖకు పంపారు. దీనిపై ఏర్పాటైన అధికారుల కమిటీ ఛార్జీల పెంపుపై సెప్టెంబర్? నెలలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. తాజాగా ఈ ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలపగా, రవాణా శాఖ ఉత్తర్వులు జారీచేసింది. తెలంగాణలో ఈవీ ఆటో పథకం - రూ.200 కోట్లు కేటాయిస్తున్న ప్రభుత్వం - లబ్ధిదారులకు రూ.1.50 లక్షల సబ్సిడీ

# : ప్రపంచ కప్ షెడ్యూల్లో బిగ్ ట్విస్ట్ ఇచ్చిన ఐసీసీ.. అదేంటంటే ?




ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న శుభవార్త రానే వచ్చింది. 2027 వన్డే ప్రపంచకప్ టోర్నీకి సంబంధించిన అధికారిక షెడ్యూల్‌ను అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) కేప్ టౌన్ వేదికగా అత్యంత వైభవంగా ఆవిష్కరించింది. ఈ ప్రధాన ఘట్టంతో ఈ మెగా టోర్నీకి సరిగ్గా ఒక ఏడాది కౌంట్‌డౌన్ ప్రారంభం కానుంది. ఈ వేడుకలోనే అధికారికంగా మ్యాచ్‌ల తేదీలతో పాటు టికెట్ల కేటాయింపు ప్రక్రియ కూడా ప్రారంభించింది. ఈసారి 2027 వన్డే వరల్డ్ కప్‌ను సౌతాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఈసారి టోర్నమెంట్‌లో మొత్తం 14 జట్లు పాల్గొంటుండగా, 12 వేదికలపై 57 మ్యాచ్‌లు జరగనున్నాయి. ఇక టోర్నమెంట్ ఫార్మాట్‌లోనూ ఐసీసీ కొన్ని కీలక మార్పులు చేసింది. గ్రూప్ దశ తర్వాత కొత్తగా సూపర్ 7 స్టేజ్‌ను పరిచయం చేశారు. ఈ టోర్నీ వచ్చే ఏడాది అక్టోబర్ 2న మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ప్రారంభమై, నవంబర్ 21న ఫైనల్ మ్యాచ్‌తో ముగియనుంది.వన్డే ప్రపంచకప్‌కు సంబంధించిన గ్రూపులను ×జజ ప్రకటించింది.గ్రూప్ ాా:ఆఫ్ఘనిస్థాన్, ఆస్ట్రేలియా, భారత్, పాకిస్థాన్, జింబాబ్వే, క్వాలిఫయర్ ాాగ్రూప్ దీ:బంగ్లాదేశ్, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, న్యూజిలాండ్, క్వాలిఫయర్ దీమారిన టోర్నమెంట్ స్వరూపంఐసీసీ పురుషుల వన్డే ప్రపంచకప్ 2027లో ప్రధానంగా జట్ల సంఖ్యతో పాటు టోర్నీ నిర్వహణ విధానమే పూర్తిగా మారింది. గత 2023 ప్రపంచకప్‌లో 10 జట్లు ఒకే లీగ్ విధానంలో ఒక్కో జట్టుతో ఆడగా, 2027లో 14 జట్లను తీసుకొచ్చి మూడు దశల కొత్త ఫార్మాట్‌ను అమలు చేస్తున్నారు. మొదట ర్యాంకింగ్స్‌లో 12, 13, 14 స్థానాల్లో ఉన్న మూడు జట్లు సూపర్ సిరీస్‌లో రౌండ్ రాబిన్ పద్ధతిలో తలపడతాయి. అందులో విజేత ప్రధాన గ్రూప్ దశలోకి వెళ్తుంది. ఆ తర్వాత మొత్తం 12 జట్లను రెండు గ్రూపులుగా విభజించి, ఒక్కో గ్రూపులో ఆరు జట్లతో మ్యాచ్‌లు నిర్వహిస్తారు. ప్రతి గ్రూప్‌లోని అగ్ర మూడు జట్లతో పాటు రెండు గ్రూపుల్లో తదుపరి అత్యుత్తమ రికార్డు ఉన్న మరో జట్టు కలిపి ఏడు జట్లు సూపర్ 7 దశకు చేరతాయి.అసలు కీలకమైన మార్పు సూపర్ 7 దశలోనే ఉంటుంది. ఏడు జట్లు మరోసారి రౌండ్ రాబిన్ విధానంలో తలపడతాయి. ఇక్కడ

# వన్డే హిస్టరీలో ఆల్‌టైం టాప్ 7 భారీ స్కోర్లు



ఇటీవల గౌహతి వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన రెండో వన్డేలో భారత జట్టు 406 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించి చరిత్ర సృష్టించింది. విండీస్ జట్టు 400 దాటినా మ్యాచ్ ఓడిపోవడం విశేషం. అయితే వన్డే క్రికెట్ చరిత్రలో 400 కంటే ఎక్కువ పరుగులు నమోదు కావడం ఇదే తొలిసారి కాదు. వన్డే ఫార్మాట్‌లో అత్యంత వేగవంత మైన బ్యాటింగ్‌తో ప్రత్యర్థి బౌలర్లను చిత్తు చేస్తూ నమోదైన టాప్ 7 భారీ స్కోర్ల వివరాలు చూద్దాం. 1. ఇగ్లాండ్ -- 498/4 (వర్సెస్ నెదర్లాండ్స్, 2022

పురుషుల వన్డే అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలో అత్యధిక జట్టు స్కోరు రికార్డు ఇంగ్లాండ్ పేరిట ఉంది. 2022లో నెదర్లాండ్స్‌పై ఇంగ్లీష్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి ఏకంగా 498 పరుగులు సాధించింది. ఈ మ్యాచ్‌లో జోస్ బట్లర్ కేవలం 70 బంతుల్లోనే 162 పరుగులతో నాటౌటగా నిలిచి విరు చుకుపడ్డారు. 2. ఇంగ్లాండ్ -- 481/6 (వర్సెస్ ఆస్ట్రేలియా, 2018)

రెండో స్థానంలో కూడా ఇంగ్లాండ్ జట్టే కొనసాగుతోంది. 2018లో ట్రెంట్ బ్రిడ్జ్ వేదికగా ఆస్ట్రేలియాపై ఇంగ్లాండ్ 6 వికెట్లు కోల్పోయి 481 పరుగుల భారీ స్కోరు సాధించింది. అలెక్స్ హేల్స్, జానీ బెయిర్‌స్టో చెలరేగి సెంచరీలు సాధించడంతో ఈ కొండంత స్కోరు నమోదైంది.

3. ఇంగ్లాండ్ -- 444/3 (వర్సెస్ పాకిస్థాన్, 2016)

ఈ లిస్టులో మూడో స్థానాన్ని కూడా ఇంగ్లాండే సొంతం చేసుకుంది. 2016లో పాకిస్థాన్‌పై ఇంగ్లీష్ టీం 3 వికెట్ల నష్టానికి 444 పరుగులు రాబట్టింది. ఆ మ్యాచ్‌లో అలెక్స్ హేల్స్ 171 పరుగుల మెరుపు ఇన్నింగ్స్ ఆడి జట్టు భారీ స్కోరు సాధించడంలో ప్రధాన పాత్ర పోషించారు.

4. శ్రీలంక -- 443/9 (వర్సెస్ నెదర్లాండ్స్, 2006)

నాలుగో స్థానంలో శ్రీలంక నిలిచింది. 2006లో నెదర్లాండ్స్‌పై లంక జట్టు 9 వికెట్లకు 443 పరుగులు చేసింది. దాదాపు పదేళ్ల పాటు ప్రపంచ వన్డే చరిత్రలోనే అత్యధిక టీమ్ టోటల్‌గా ఈ స్కోరు చెక్కుచెదరకుండా నిలవడం విశేషం. 5. సౌతాఫ్రికా -- 439/2 (వర్సెస్ వెస్టిండీస్, 2015) ఐదో స్థానాన్ని సౌతాఫ్రికా దక్కించుకుంది. 2015లో వెస్టిండీస్‌తో జరిగిన

# టీమిండియాలో ఎవరీ టీటీవీ నంబూరి.. ఆసియా క్రీడల్లో విచిత్రం




ఆసియా క్రీడల్లో భాగంగా భారత్, శ్రీలంక జట్ల మధ్య జరిగిన కీలకమైన సెమీఫైనల్ మ్యాచ్‌తో పాటు మరో ఆసక్తికర అంశం తెరపైకి వచ్చింది. మైదానంలో ఆటగాళ్ల ప్రదర్శన కంటే బ్రాడ్‌కాస్టర్ చూపించిన స్కోర్‌బోర్డ్ గ్రాఫిక్స్ అందరి దృష్టిని ఆకర్షించాయి. సాధారణంగా క్రికెట్ ప్రపంచంలో సుపరిచితమైన షార్ట్ నేమ్స్‌తో కనిపించే ఆటగాళ్లు, ఈ టోర్నమెంట్‌లో మాత్రం పూర్తిగా కొత్త పేర్లతో దర్శనమిచ్చారు.ఎవరు ఈ టీటీవీ నంబూరి? భారత యువ బ్యాటర్ తిలక్ వర్మ పేరు స్క్రీన్ పై ి. కనిపించడంతో అభిమానులు ఒక్కసారిగా కన్ఫ్యూజన్‌కు గురయ్యారు. అసలు ఈ కొత్త ఆటగాడు ఎవరంటూ సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు రకరకాల ప్రశ్నలు లేవనెత్తారు. తిలక్ వర్మ పూర్తి పేరు నంబూరి ఠాకూర్ తిలక్ వర్మ కాగా, ఆసియా క్రీడల నిబంధనల ప్రకారం పాస్‌పోర్ట్ లేదా అధికారిక మరికొందరు భారతీయ ఆటగాళ్ల పేర్లు కూడా ఇలాగే భిన్నంగా ప్రదర్శించబడ్డాయి. వికెట్ కీపర్ బ్యాటర్ సంజు శాంసన్ పేరు ఎస్ విశ్వనాథ్ తరహాలో అధికారిక డాక్యుమెంట్ల పేర్లతో స్కోర్‌బోర్డ్‌లో కనిపించాడు. ఒలింపిక్స్, ఆసియా క్రీడలు అలాగే కామన్వెల్త్ గేమ్స్ వంటి మల్టీ-స్పోర్ట్స్ ఈవెంట్లలో అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ నిబంధనల ప్రకారం అథ్లెట్ల పూర్తి అధికారిక పేర్లనే వాడాల్సి రిజిస్ట్రేషన్ పేర్లను ప్రదర్శించడంతో ఈ గందరగోళం తలెత్తింది.మరికొంత మంది

ఆటగాళ్ల పేర్లలో మార్పులు

కేవలం తిలక్ వర్మ మాత్రమే కాకుండా

# హోమ్ లోన్ జం ప్రాపర్టీ లోన్.. మీకు ఏది బెస్ట్..? ఈ చిన్న తప్పులతో జేబుకు చిల్లే..!




మనిషి జీవితంలో ఆర్థిక భద్రతను నిర్మించుకోవడంలో స్థిరాస్తుల కొనుగోలు ఎంతో కీలకమైన పాత్ర పోషిస్తుంది. సొంత ఇంటి కలను నెరవేర్చుకోవడానికో లేదా ఇప్పటికే ఉన్న ఆస్తుల విలువ ఆధారంగా తక్షణ అవసరాలకు డబ్బుల కోసం బ్యాంకులు ప్రధానంగా రెండు రకాల లోన్ సౌకర్యాలను అందిస్తున్నాయి. అవే హోమ్ లోన్, ప్రాపర్టీ లోన్. ఈ రెండింటి నిబంధనలు పూర్తిగా వేర్వేరు కాబట్టి మీ ప్రస్తుత అవసరానికి తగినదాన్ని ఎంచుకోవడం ఎంతో ముఖ్యం. హోమ్ లోన్ అనేది కొత్తగా ఒక ఇంటిని, ఫ్లాట్‌ను కొనడానికి లేదా సొంత స్థలంలో నూతన ఇళ్లు నిర్మించుకోవడానికి మాత్రమే బ్యాంకులు మంజూరు చేసే లోన్. దీనిని పొందడానికి దరఖాస్తుదారుడికి మెరుగైన క్రెడిట్ స్కోర్‌తో పాటు లోన్ సకాలంలో చెల్లించగల స్థిరమైన ఆదాయం ఉండటం తప్పనిసరి. బ్యాంకుల మధ్య నెలకొన్న తీవ్ర పోటీ కారణంగా హోమ్ లోన్లకు వడ్డీ రేట్లు తక్కువగా ఉండటంతో పాటు 20 నుంచి 30 సంవత్సరాల వరకు సుదీర్ఘ కాలవ్యవధిలో రీపేమెంట్ చేసుకునే వెసులుబాటు లభిస్తుంది.

మరోవైపు ఆస్తిపై లోన్ అనేది ఇప్పటికే మీ పేరిట ఉన్న నివాస లేదా వాణిజ్య స్థలాన్ని బ్యాంకు వద్ద తాకట్టు పెట్టి నగదు పొందే పద్ధతి. ఇందులో వచ్చే నిధులను ఇంటి నిర్మాణానికే కాకుండా వ్యాపార విస్తరణ, ఉన్నత చదువులు, వివాహ ఖర్చులు లేదా అత్యవసర వైద్య ఖర్చుల వంటి ఏ అవసరానికైనా ఎటువంటి ఆంక్షలు లేకుండా ఉపయోగించుకోవచ్చు. అయితే ఈ లోన్‌లో మీ ఆస్తి మార్కెట్ విలువను బట్టి మాత్రమే డబ్బులు వస్తాయి. ఉదాహరణకు మీ ఆస్తి విలువ రూ.1 కోటి ఉంటే బ్యాంకు రూల్స్ ప్రకారం రూ. 50 లక్షల నుండి రూ. 70 లక్షల వరకే లోన్ లభిస్తుంది తప్ప పూర్తి కోటి రూపాయలు ఇవ్వరు. ఈ రెండింటిలో ఏది మీకు సరైనదో తేల్చుకోవడానికి మీ అవసరమే గీటురాయి. మీరు కొత్తగా ఇంటిని తీసుకోవడం లేదా సొంత స్థలంలో కట్టుకోవాలనుకుంటే తక్కువ వడ్డీకే లభించే హోమ్ లోన్ బెస్ట్ ఆప్షన్. అలా కాకుండా ఇప్పటికే మీ వద్ద ఉన్న ఫ్లాట్ లేదా ఖాళీ స్థలాన్ని ఉపయోగించి కొత్త వ్యాపారం ప్రారంభించాలన్నా, లేదా పెద్ద మొత్తంలో డబ్బు అవసరమైనా దాన్నిపై లోన్ తీసుకోవడం సరైన అవుతుంది.

# యూపీఐ ఛార్జీలు తప్పించుకోవడానికి ఈ ట్రిక్ ఫ్లటిస్తే అంతే సంగతులు..



ఇప్పటివరకు యూపీఐ లావాదేవీలు ఉచితంగా చేసుకునే వెసులుబాటు ఉండేది. కానీ ఇంకొద్ది రోజుల్లో యూపీఐ లావాదేవీలకు ఛార్జీలు పడనున్నాయి. అవును.. అక్టోబర్ 15వ నుండి కొత్త ఖూ× నిబంధనలు అమల్లోకి రానున్నాయి. ఈ కొత్త ఖూ× నిబంధనల ప్రకారం రూ.2,000 కంటే ఎక్కువ విలువైన ఖూ× మర్చంట్ లావాదేవీలపై 0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేట్ (వీణ=) వర్తిస్తుంది. ఉదాహరణకు ఒక కస్టమర్ రూ.3,000 బిల్లు చెల్లించినట్లయితే.. వ్యాపారికి రూ.12 వీణ= ఛార్జ్ పడుతుంది. ఈ వీణ= అనేది వ్యాపారి వైపున వర్తించే ఛార్జ్‌గా చెప్పవచ్చు. దీనిని కస్టమర్లపైకి బదిలీ చేయకూడదు. అయితే కొన్ని సందర్భాల్లో వ్యాపారులు ఈ అదనపు ఛార్జీలను కస్టమర్ల నుండి వసూలు చేయడానికి ప్రయత్నించవచ్చు. అలాంటి సమయంలో కస్టమర్లు, వ్యాపారులు ఇద్దరూ వీణ= ఛార్జీల భారం నుండి తప్పించుకోవడానికి ఒక సులభమైన ఆలోచన చేస్తున్నారు. అదేంటి అంటే.. రూ.2,000 కంటే ఎక్కువ మొత్తంలో చేసే లావాదేవీలను చిన్న మొత్తాలుగా విభజించి చెల్లించడం ద్వారా ఈ ఛార్జీలను నివారించవచ్చని యోచిస్తున్నారు.చిక్కుల్లో పడే అవకాశం..ఉదాహరణకు రూ.3,000 చెల్లించాల్సి వస్తే.. ఆ మొత్తాన్ని రెండు రూ.1,500 లావాదేవీలుగా విభజించి చెల్లించవచ్చు. ఒక్కో లావాదేవీ రూ.2,000 కంటే తక్కువగా ఉండటం వల్ల వీణ= ఛార్జ్ వర్తించదు. ఈ పద్ధతి ద్వారా కస్టమర్, వ్యాపారి ఇద్దరూ అదనపు ఛార్జీలు చెల్లించకుండా డిజిటల్ చెల్లింపుల ప్రయోజనాలను పొందవచ్చు. వీణ= ఛార్జీల అప్లికేబిలిటీ, రేట్లు వ్యాపారి వర్గం, వర్తించే నిబంధనలపై ఆధారపడి మారవచ్చు. అయితే అలా విభజించి యూపీఐ పేమెంట్ చేయడం వల్ల ఇబ్బందులు వచ్చే అవకాశముందని నిపుణులు చెబుతున్నారు. తక్కువ వ్యవధిలో ఒకే వ్యాపారికి పదేపదే ఒకే మొత్తాన్ని ట్రాన్స్‌ఫర్ చేయడం వల్ల బ్యాంకు మోసాల పర్యవేక్షణ వ్యవస్థ దీనిని అసాధారణమైనదిగా పరిగణించవచ్చని చెబుతున్నారు. బ్యాంకులు ఎప్పటికప్పుడు వినియోగదారుల లావాదేవీలను పర్యవేక్షిస్తాయి. ఒక వినియోగదారుడు తక్కువ వ్యవధిలో ఒకే వ్యాపారికి పదేపదే తక్కువ సమయంలో డబ్బులు పంపడం వల్ల చిక్కులు ఎదురుకావొచ్చు.ఇలాంటి సందర్భాల్లో లావాదేవీలను తాత్కాలికంగా నిలిపివేసే అవకాశం ఉంటుంది. లేదా యూపీఐ సేవను తాత్కాలికంగా నిలిపివేసే ప్రమాదముంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అలాగే కొన్ని బ్యాంకులు రోజువారీ లావాదేవీలపై పరిమితులు విధిస్తాయి. మీరు ఒకే దుకాణాదారుడికి నాలుగుసార్లు లావాదేవీలు చేయడం వల్ల మీ లిమిట్ అయిపోతుంది. దీని వల్ల వేరేవారికి పేమెంట్స్ చేయలేరు. అయితే ఇలాంటి ఎత్తుగడలను నివారించేందుకు యూపీఐ వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చే అవకాశం భవిష్యత్తులో ఉంటుంది. అదనపు భద్రతా వ్యవస్థలను ప్రవేశపెట్టే

# బంగారం ధరల్లో ఊహించని మార్పులు.. హైదరాబాద్, విజయవాడలో తులం ఎంతుందంటే..



బంగారం, వెండి ధరల్లో ఊహించని మార్పులు చోటుచేసుకుంటున్నాయి.. ఇటీవల భారీగా పెరిగిన ధరలు.. మళ్లీ తగ్గి కాస్త ఊరటనిచ్చాయి.. గత వారం రోజుల నుంచి ధరలను పరిశీలిస్తే.. దాదాపు రూ.5వేల వరకు తగ్గింది. అంతర్జాతీయంగా కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులతో మార్పులు జరుగుతున్నట్లు బులియన్ మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. అమెరికా-ఇరాన్ మధ్య యుద్ధం, రష్యా-ఉక్రెయిన్ మధ్య మళ్లీ ఉద్రిక్తతలు కొనసాగుతుండటంతో గోల్డ్ రేట్లపై తీవ్ర ప్రభావం చూపుతుందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. పలు వెబ్‌సైట్లలో నమోదైన ధరల ఆధారంగా శుక్రవారం (అక్టోబర్ 2) ఉదయం 6 గంటల వరకు దేశీయంగా బంగారం, వెండి ధరలు ఈ కింది విధంగా ఉన్నాయి.

24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధరపై 10 తగ్గి.. రూ.1,49,230 గా ఉంది.

22 క్యారెట్ల పసిడి 10 గ్రాముల ధరపై 10 తగ్గి.. రూ.1,36,790 గా ఉంది.

వెండి కిలో ధరపై 100 తగ్గి.. రూ.2,34,900 లుగా కొనసాగుతోంది.

అయితే.. ప్రాంతాల వారీగా బంగారం, వెండి ధరల్లో వ్యాత్యాసం ఉంటుంది.

హైదరాబాద్‌లో 24 క్యారెట్ల పసిడి 10 గ్రాముల ధర రూ.1,49,230, 22 క్యారెట్ల ధర రూ.1,36,790 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,39,900 ఉంది.

విజయవాడలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,49,230, 22 క్యారెట్ల ధర రూ.1,36,790 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,39,900 ఉంది.ఢిల్లీలో 24 క్యారెట్ల గోల్డ్ 10 గ్రాముల ధర రూ.1,49,400, 22 క్యారెట్ల ధర రూ.1,36,940 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,34,900 ఉంది.ముంబైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,49,230, 22 క్యారెట్ల ధర రూ.1,36,790 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,34,900 లుగా ఉంది.చెన్నైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,49,230, 22 క్యారెట్ల ధర రూ.1,36,790 ఉంది. వెండి కిలో ధర రూ.2,39,900 ఉంది.బెంగళూరులో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర

## కెరీర్ పీక్‌లో ఉండగానే ప్రమాదం.. ఎనిమిది నెలలపాటు మంచానికే పరిమితం



తెలుగు ప్రేక్షకులకు పరిచయం అవసరం లేని కథానాయికల్లో స్నేహ ఒకరు. సహజమైన అందం, చక్కటి అభినయం, కుటుంబ కథా చిత్రాల్లో ఒదిగిపోయే నటనతో ఆమె తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నారు. ముఖ్యంగా గ్లామర్‌కు మాత్రమే పరిమితం కాకుండా నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను ఎంచుకుంటూ తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమల్లో మంచి పేరు సంపాదించారు. స్నేహ అసలు పేరు సుహాసిని. తమిళ సినిమాలతో కెరీర్ ప్రారంభించిన ఆమె.. తెలుగులోనూ వరుస అవకాశాలు అందుకున్నారు.గోపీచంద్ హీరోగా తెరకెక్కిన తొలివలపు చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన స్నేహ.. ఆ తర్వాత 'ప్రియమైన నీకు' సినిమాతో మరింత దగ్గరయ్యారు. ఆ సినిమా విజయం ఆమె కెరీర్‌కు మంచి ఊపునిచ్చింది. ఆ తర్వాత వెనుదిరిగి చూడకుండా వరుస సినిమాల్లో నటిస్తూ స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. హనుమాన్ జంక్షన్, వెంకీ, సంక్రాంతి, రాధాగోపాళం, శ్రీరామదాసు, మహారధి, మధుమాసం, ఏవండోయ్ శ్రీవారు, పాండురంగడు వంటి చిత్రాల్లో విభిన్న పాత్రలు పోషించి తెలుగు ప్రేక్షకుల అభిమానాన్ని సొంతం చేసుకున్నారు.గోపీచంద్ హీరోగా తెరకెక్కిన తొలివలపు చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన స్నేహ.. ఆ తర్వాత 'ప్రియమైన నీకు' సినిమాతో మరింత దగ్గరయ్యారు. ఆ సినిమా విజయం ఆమె కెరీర్‌కు మంచి ఊపునిచ్చింది. ఆ తర్వాత వెనుదిరిగి చూడకుండా వరుస సినిమాల్లో నటిస్తూ స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. హనుమాన్ జంక్షన్, వెంకీ, సంక్రాంతి, రాధాగోపాళం, శ్రీరామదాసు, మహారధి, మధుమాసం, ఏవండోయ్ శ్రీవారు, పాండురంగడు వంటి చిత్రాల్లో విభిన్న పాత్రలు పోషించి తెలుగు ప్రేక్షకుల అభిమానాన్ని సొంతం చేసుకున్నారు.ముఖ్యంగా కుటుంబ ప్రేక్షకుల్లో స్నేహకు ప్రత్యేకమైన క్రేజ్ ఏర్పడింది. అయితే స్నేహ కెరీర్‌లో జరిగిన ఓ సంఘటన ఆమెను కుంగదీసిందట. కెరీర్ మంచి స్థాయిలో

## తత్వం మూవీ రివ్యూ



పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో కానిస్టేబుల్ డ్యూటీ చేసే కళ్యాణ్ (దినేష్ తేజ్) సబ్ ఇన్‌స్పెక్టర్ కావాలని కలలు కంటుంటాడు. ఎగ్జామ్ రాసి రిజల్ట్స్ కోసం వెయిట్ చేసే టైమ్‌లో పెళ్లి చూపుల నిమిత్తం రామాపురం ఊరికి వెళ్తాడు. అక్కడ సౌమ్య (దక్షిక)ను చూసిన వెంటనే ఇష్టపడతాడు. అదే ఊళ్లో మూర్తి, నాగమణి అనే భార్యాభర్తలు వ్యవసాయం మీద బతుకుతుంటారు. వాళ్ల కొడుకు సుధ మానసిక స్థితి సరిగ్గా ఉండదు. అనుకోని పరిస్థితుల్లో ఆ వృద్ధ దంపతులు దారుణ హత్యకు గురవుతారు. మానసిక రోగి అయిన సుధనే వాళ్లను చంపాడని ఊరి జనాలు అతడిని కొడతారు. ఈ గొడవ పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కడంతో, ఆ ఊరికి వచ్చిన కళ్యాణ్ చేతికి ఈ కేసు దర్యాప్తు వస్తుంది. అసలు ఆ భార్యాభర్తలను చంపిందెవరు, సుధ నిజంగానే హంతకుడా, ఈ మిస్టరీని కళ్యాణ్ ఎలా చేధించాడు, సౌమ్యతో అతడి పెళ్లి జరిగిందా అనేది ఈ మూవీ స్టోరీ.కథనంఈ చిత్రాని కేవలం ఓ మామూలు మర్డర్ మిస్టరీలా కాకుండా, మనిషి ఆలోచనా విధానం, నమ్మకం, నిజానిజాలు లాంటి అంశాలను జోడించి కాస్త కొత్తగా చెప్పే ప్రయత్నం చేశారు దర్శకుడు అర్జున్ కోలా. ఒక పక్క మర్డర్ కేసు దర్యాప్తు సాగుతుండగానే, మరో పక్క తాత్విక కోణాన్ని టచ్ చేస్తూ సినిమాను నడిపించారు. ఒక వ్యక్తి ప్రవర్తన సరిగ్గా లేనంత మాత్రాన, పరిస్థితులను బట్టి అతడే నేరం చేశాడని గుడ్డిగా నమ్మేయడం కరెక్టేనా అనే పాయింట్‌ను సుధ క్యారెక్టర్ ద్వారా బలంగా చూపించారు. ఊరి జనాల అనుమానాలు, పోలీసుల ఎంక్వైరీ, అసలు నిజాన్ని రాబట్టేందుకు హీరో చేసే పోరాటం ఆకట్టుకుంటుంది. కానిస్టేబుల్ స్థాయి నుంచి ఒక పెద్ద కేసును డీల్ చేసే బాధ్యతాయుతమైన రోల్‌లో హీరో జర్నీ ఆసక్తిని రేకెత్తిస్తుంది. అలాగే హీరోయిన్ ట్రాక్ కూడా కథకు బాగానే సింక్ అయింది. క్రైమ్ థ్రిల్లర్‌కు ఆధ్యాత్మికత, వేదాంతం లాంటివి మిక్స్ చేయడం మంచి ప్రయోగమే అయినా, ఇలాంటి కథలకు నెరేషన్ చాలా గ్రిప్పింగ్‌గా ఉండాలి. కానీ దర్శకుడు కొన్ని చోట్ల సాగదీతకు గురి చేశాడు. సీన్స్ చాలా నెమ్మదిగా సాగడం వల్ల ఆడియన్స్‌కు కాస్త బోర్ కొడుతుంది. క్లైమాక్స్ ట్విస్టులు, ఇన్వెస్టిగేషన్ సీన్స్ రాసుకున్న తీరు బాగున్నా, కథనంలో స్పీడ్ పెంచి ఉంటే రిజల్ట్ మరోలా ఉండేదినటీనటులునిస్టేబుల్ కళ్యాణ్ రోల్‌లో దినేష్ తేజ్ చాలా చక్కగా సెట్ అయ్యాడు. తన యాక్టింగ్‌తో క్యారెక్టర్‌కు మంచి డెప్త్ తీసుకొచ్చాడు. పల్లెటూరి అమ్మాయి సౌమ్యగా దక్షిక తన క్యూట్ లుక్స్‌తో, క్యూట్ పర్ఫార్మెన్స్‌తో ఆకట్టుకుంది. మెంటల్ కండిషన్ సరిగ్గా లేని సుధ పాత్ర చేసిన నటుడు తన పాత్రకు పూర్తిగా న్యాయం చేశాడు. మిగిలిన సపోర్టింగ్ ఆర్టిస్టులు కూడా తమ పాత్రల పరిధి మేరకు బాగానే నటించి మెప్పించారు.

## ఆ హీరో అంటే నాకు పిచ్చి.



టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి కాజల్ అగర్వాల్ గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. తెలుగు, తమిళ చిత్రాల్లో ఎన్నో విజయవంతమైన సినిమాల్లో నటించిన ఆమె.. తన అందం, అభినయంతో భారీగా అభిమానులను సంపాదించుకున్నారు. ప్రస్తుతం సినిమాలతో పాటు వ్యక్తిగత జీవితానికీ సమయం కేటాయిస్తున్న కాజల్.. గతంలో ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలను పంచుకుంది. ఈ సందర్భంగా సౌత్ సినిమా ఇండస్ట్రీలో హీరోయిన్లను గ్లామర్ పరంగా చూపించే విధానంపై కాజల్ స్పందించారు. ముఖ్యంగా కథతో సంబంధం లేకుండా హీరోయిన్ల నడుమును చూపించేందుకు ఎక్కువగా ఆసక్తి చూపిస్తారనే అభిప్రాయంపై ఆమెను ప్రశ్నించగా.. గతంలో ఇలాంటి అపోహలు ఉండి ఉండొచ్చు కానీ ఇప్పుడు పరిస్థితులు క్రమంగా మారుతున్నాయని కాజల్ పేర్కొంది. ప్రేక్షకుల అభిరుచులతో పాటు ఇండస్ట్రీలో కూడా చాలా మార్పులు వచ్చాయని కాజల్ అంది. ఈ సందర్భంగా సౌత్ సినిమా ఇండస్ట్రీలో హీరోయిన్లను గ్లామర్ పరంగా చూపించే విధానంపై కాజల్ స్పందించారు. ముఖ్యంగా కథతో సంబంధం లేకుండా హీరోయిన్ల నడుమును చూపించేందుకు ఎక్కువగా ఆసక్తి చూపిస్తారనే అభిప్రాయంపై ఆమెను ప్రశ్నించగా.. గతంలో ఇలాంటి అపోహలు ఉండి ఉండొచ్చు కానీ ఇప్పుడు పరిస్థితులు క్రమంగా మారుతున్నాయని కాజల్ పేర్కొంది. ప్రేక్షకుల అభిరుచులతో పాటు ఇండస్ట్రీలో కూడా చాలా మార్పులు వచ్చాయని కాజల్ అంది. ప్రస్తుతం సినిమాల్లో మహిళా పాత్రలకు, కథలో వారి ప్రాధాన్యానికి కూడా ఎక్కువ స్థానం లభిస్తోందనే అభిప్రాయాన్ని ఆమె వ్యక్తం చేసింది. ఇక ఇదే ఇంటర్వ్యూలో కాజల్‌కు ఎదురైన మరో ఆసక్తికరమైన ప్రశ్న ఆమె ఫేవరెట్ హీరో గురించి. మీకు ఇష్టమైన హీరో ఎవరు.? అని అడగ్గా.. బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ పేరు చెప్పింది ఈ అందాల తార. చిన్నప్పటి నుంచే సల్మాన్ ఖాన్ అంటే తనకు ఎంతో ఇష్టమని, ఆయనే తన క్రష్ అని కాజల్ చెప్పుకొచ్చింది. ప్రస్తుతం సినిమాల్లో మహిళా పాత్రలకు, కథలో వారి ప్రాధాన్యానికి కూడా ఎక్కువ స్థానం లభిస్తోందనే అభిప్రాయాన్ని ఆమె వ్యక్తం చేసింది. ఇక ఇదే ఇంటర్వ్యూలో కాజల్‌కు ఎదురైన మరో ఆసక్తికరమైన ప్రశ్న ఆమె ఫేవరెట్ హీరో గురించి. మీకు

## బిగ్‌బాస్‌లో ఈ వారం డబుల్ ఎలిమినేషన్..



బిగ్ బాస్ తెలుగు సీజన్ 10 రసవత్తరంగా, ఆసక్తికరంగా సాగుతోంది. ముఖ్యంగా కంటెస్టెంట్స్, ఆడియెన్స్ అంచనాలకు అందుకోకుండా బిగ్ బాస్ భలే ట్విస్టులు ఇస్తున్నాడు. సెప్టెంబర్ 07న ప్రారంభమైన ఈ రియాలిటీ షో ఇప్పటికే సక్సెస్ ఫుల్ గా మూడు వారాలు పూర్తి చేసుకుంది. ఇప్పుడు నాలుగో వారం ఎండింగ్ కు కూడా చేరుకుంది. కాబట్టి ఈ వారం ఎవరు ఎలిమినేట్ అవుతారన్నది ఆసక్తికరంగా మారింది.బిగ్ బాస్ మొదటి వారం లో చైత్ర ఎలిమినేట్ అయ్యింది. ఆ తరవాత రెండవ వారం లో నటుడు కృష్ణుడు ఎలిమినేటయ్యి హౌస్ నుంచి బయటకు వచ్చేశాడు. ఇక మూడో వారం ముఖేష్ త్యాగం కారణంగా ఎలిమినేషన్ జరగలేదు. దీంతో నాలుగో వారంలో డబుల్ ఎలిమినేషన్ ఉండనుందని తెలుస్తోంది. నాలుగో వారం ఎలిమినేషన్ కు సంబంధించి మొత్తం తొమ్మిది మంది కంటెస్టెంట్లు నామినేషన్స్‌లో ఉన్నారు. ముఖేష్ గౌడ, త్రిగుణ్, దేబ్జానీ, రోహిత్, షాలిని, అమన్, నరేష్, చరణ్, సృష్టి ఈ వారం ఎలిమినేషన్‌ను ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతమున్న ఓటింగ్ ట్రెండ్స్ ను ఒకసారి పరిశీలిస్తే.. స్టార్ కంటెస్టెంట్ త్రిగుణ్ కు భారీగా ఓట్లు పడుతున్నాయి. దీంతో ఇప్పుడు అతను టాప్ ప్లేస్ లో కొనసాగుతున్నాడు. గత వారం కంటే ఈ వారం ఓటింగ్‌లోనే త్రిగుణ్ కు భారీ మద్దతు లభిస్తోంది. త్రిగుణ్ తర్వాత 13.17 శాతం ఓట్లతో రోహిత్ రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. ఇక హౌస్ లో నిలకడైన ఆట, మాట తీరుతో ఆకట్టుకుంటోన్న సీరియల్ నటుడు ముఖేష్ కు రోజు రోజుకు ఫ్యాన్ బేస్ పెరుగుతోంది. మొన్నటి వరకు ఐదో స్థానంలో ఉన్న ముఖేష్ ప్రస్తుతం మూడో స్థానానికి చేరుకున్నాడు. వీరి తర్వాత జబర్దస్త్ నాలుగో ప్లేస్ లో ఉన్నాడు. అలాగే ఐదో స్థానంలో అమన్ మసూద్, ఆరో స్థానంలో శాలినీ, ఏడో ప్లేసులో దేబ్జానీ, ఎనిమిదో స్థానంలో చరణ్, తొమ్మిదో ప్లేసులో సృష్టి ఉన్నారు.

అంటే ప్రస్తుతం చరణ్, సృష్టి డేజర్ జోన్ లో ఉన్నారన్నమాట. నిజానికి రెండవ వారమే కృష్ణుడు స్థానంలో సృష్టి ఎలిమినేట్ కావాల్సి ఉండగా.. కృష్ణుడిని ఆడియన్స్ మొదట ఎలిమినేట్ చేశారు. దీనికి తోడు సుధీర్ పట్ల ఆమె వ్యవహరించిన తీరు కారణంగా సోషల్ మీడియాలో బాగా ట్రోలింగ్ కు గురైంది సృష్టి. కాబట్టి ఈ వారంలో సృష్టినే ఎలిమినేట్ అయ్యే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని తెలుస్తోంది. ఒక వేళ డబుల్ ఎలిమినేషన్ జరిగితే.. చరణ్ కూడా బిగ్ బాస్ హౌస్ నుంచి బయటకు వెళ్లే అవకాశం ఉంది. మొదటి వారం మిడ్ వీక్ ఎలిమినేషన్ లో భాగంగా ఎలిమినేట్ అయిన చరణ్ కు మళ్ళీ వారం ఆయనకు రెండవ అవకాశం కల్పించారు. అయితే ఈ అవకాశాన్ని కూడా చరణ్ సరిగా ఉపయోగించుకోలేకపోతున్నాడు. దీనికి తోడు ఝాన్సీపై అతను చేసిన వ్యాఖ్యలు తీవ్రమైన నెగెటివిటీని తీసుకొచ్చాయి.

## ఓటీటీలోకి వచ్చేసిన కార్తీ లేటస్ట్ యాక్షన్ స్పై యాక్షన్ థ్రిల్లర్..



కోలీవుడ్ స్టార్ హీరో కార్తీ నటించిన లేటెస్ట్ స్పైయాక్షన్ థ్రిల్లర్ సర్దార్ 2. సుమారు నాలుగేళ్ల క్రితం (2022)లో రిలీజై బ్లాక్ బస్టర్ గా నిలిచిన సర్దార్ సినిమాకు సీక్వెల్ గా సర్దార్ 2 తెరకెక్కింది. మొదటి భాగాన్నే తెరకెక్కించిన దర్శకుడు పీఎస్ మిత్రనే రెండో భాగానికి కూడా దర్శకత్వం వహించాడు. కార్తీ సరసన మాళవిక మోహనన్, ఆషికా రంగనాథ్ హీరోయిన్లు నటించారు. అలాగే విలక్షణ నటుడు ఎస్జే సూర్య విలన్ గా నటించడం విశేషం. ఇలా స్టార్ క్యాస్టింగ్ కు తోడు గ్లింప్స్, ట్రైలర్ తో రిలీజ్ కు ముందు సర్దార్ 2 పై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. అలాగే హీరో కార్తీ, ఎస్జే సూర్య భారీగా ప్రమోషన్ కార్యక్రమాలు చేపట్టారు. అయితే తీరా థియేటర్లలోకి అడుగు పెట్టాక సర్దార్ 2 అభిమానుల అంచనాలు అందుకోలేకపోయింది. ఈనెల 10న ప్రపంచ వ్యాప్తంగా రిలీజైన ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ మూవీకి మిక్స్ డ్ టాక్ వచ్చింది. తమిళంలో ఓ మాదిరి కలెక్షన్లు వచ్చినప్పటికీ తెలుగులో ఈ సినిమాకు చాలా తక్కువ వసూళ్లు వచ్చాయి. అయితే ఉన్నంతలో డబుల్ రోల్ లో కార్తీ నటన, ఎస్జే సూర్య విలనిజం అభిమానులను మెప్పించాయి. థియేటర్లలో పెద్దగా ఆడని సర్దార్ 2 సినిమా ఇప్పుడు ఓటీటీలోకి వచ్చేసింది.సర్దార్ 2 సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియో సొంతం చేసుకుంది. అక్టోబర్ 01 నుంచే ఈ సినిమాను స్ట్రీమింగ్ చేయనున్నట్లు ఇదివరకే ఓటీటీ సంస్థ అధికారికంగా ప్రకటించింది. అందుకు తగ్గట్టుగానే గురువారం అర్ధరాత్రి నుంచే ఈ సినిమా ఓటీటీ స్ట్రీమింగ్ కు వచ్చేసింది. తెలుగుతో పాటు తమిళం, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లోనూ సర్దార్ 2 సినిమా అందుబాటులోకి వచ్చింది.

## ఎనిమిదేళ్లు అతన్ని పిచ్చిగా ప్రేమించా.. చివరకు మోసం చేశాడు :



తెలుగు టెలివిజన్‌లో కామెడీకి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన షోల్లో జబర్దస్త్ ఒకటి. ఈ కార్యక్రమం ద్వారా ఎంతో మంది కమెడియన్లు, నటులు వెలుగులోకి వచ్చారు. కొందరు సినిమాల్లో నటులుగా, మరికొందరు దర్శకులుగా తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఇక జబర్దస్త్‌లో లేడీ గెటప్స్‌తో ప్రేక్షకులను నవ్వించిన పలువురు ఆర్టిస్టుల్లో తన్మయి కూడా ఒకరు. తన ప్రత్యేకమైన కామెడీ టైమింగ్‌తో ఆమె ప్రేక్షకులకు చేరువయ్యారు. జబర్దస్త్‌తో పాటు ఇతర టీవీ కార్యక్రమాలు, ఈవెంట్లలోనూ కనిపిస్తూ తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న తన్మయి.. గతంలో ఓ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితం గురించి ఎన్నో ఆసక్తికర విషయాలను వెల్లడించారు.తెరపై నవ్వులు పంచే తన వెనుక ఎన్నో కన్నీళ్లు, కష్టాలు, ఒంటరి పోరాటం ఉంది. చిన్నతనం నుంచే తమ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొందని తన్మయి వెల్లడించారు. చదువుపై ఆసక్తి ఉన్న తనకు డాక్టర్ కావాలనే కోరిక ఉండేదని తెలిపారు. బైపీసీ చదివి వైద్య రంగంలోకి వెళ్లాలని అనుకున్నప్పటికీ, కుటుంబ ఆర్థిక పరిస్థితులు అందుకు సహకరించలేదని చెప్పారు. చివరకు డిగ్రీ వరకు చదువును కొనసాగించగలిగానని వివరించారు. కుటుంబ పరిస్థితుల కారణంగా చిన్న వయసులోనే సంపాదనపై దృష్టి పెట్టాల్సి వచ్చిందని ఆమె తెలిపారు.తెరపై నవ్వులు పంచే తన వెనుక ఎన్నో కన్నీళ్లు, కష్టాలు, ఒంటరి పోరాటం ఉంది. చిన్నతనం నుంచే తమ కుటుంబం

Printed, published &owned. By ravula rajesham printed at. JORDAR publication H.NO.2-5_146 . jammikunta.dist. karimnagar Telangana state 505122..editor.ravula rajesham, email. editor jordar@gmail.com. cellphone 7780185674 PRGi numberTG TEL/25/A5224